



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 341 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 27 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-




పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు
**వినాయక చవితి శుభాకాంక్షలు**

నేడు వినాయక చవితి సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున రేపు (గురువారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.



# ఐదు సర్వీసులకే @ ఫ్రీ బస్



## ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఫ్రీ అన్నారు
## ఇప్పుడు కనీసం నాన్ స్టాప్ సర్వీసులకు కూడా అమలు లేదు
## ప్రభుత్వం పెట్టిన కండిషన్లతో మహిళలు దిగాలు



- అన్ని బస్సుల్లో అమలు చేయాలంటున్న వైయస్సార్సీపీ
- ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్ని నాన్ స్టాప్ లుగా మార్చేశారంటున్న ప్రతిపక్షం
- కనీసం 50 శాతం డిస్కౌంట్‌తో ఏసీ బస్సుల్లోనూ అమలు చేయాలని డిమాండ్
- ఆటో డ్రైవర్ల డిమాండ్‌పై నోరు మెదపని కూటమి సర్కారు
- మూడు నెలలు గడిస్తే కానీ పూర్తిగా విశ్లేషణ చేయలేం..

**అమరావతి, విశ్వం వాయిస్ బ్యూరో చిప్ (షేక్ కాలీషా వలి) న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తోంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఉచిత ప్రయాణం కోసం మహిళలు గుర్తింపు కార్డు చూపించాలి. తిరుమల–తిరుపతి మధ్య నడిచే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. అలాగే ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సుల్లో కూడా ఈ సౌకర్యం లేదు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, ఏసీ బస్సులకు ఈ పథకం వర్తించదు. బస్సుల్లో సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ ఓర్న్ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బస్టాండ్లలో - మిగతా2లో



## బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువు పొడిగింపు

- టెండర్ల డెడ్‌లైన్‌ను ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్టు ప్రకటన
- ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల పై మద్యం వ్యాపారులు ఆసక్తిగా లేరు
- దీంతో టెండర్ల గడువు సమీపిస్తున్నా వారి నుంచి ఆసక్తి కనిపించటం లేదు

# ప్రజల కోసం పనిచేయండి



- రొటీన్ సమావేశాలు వద్దు..
- బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు

**అమరావతి**

ఖరీఫ్ సీజన్‌లో రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యానికిగానూ జూన్ నాటికి రూ.94,666 కోట్ల మేర రుణాలను ఇచ్చినట్లు సీఎం చంద్రబా బుకు బ్యాంకర్లు వెల్లడించాయి. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్ల రుణాల్ని మంజూరు చేసిన బ్యాంకులు. ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.49,831 కోట్ల రుణం మంజూరు. విద్యారంగానికి రూ.252 కోట్లు, హౌసింగ్ కు రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు. పునరుద్పాదక ఇంధన రంగానికి రూ.125 కోట్ల మేర రుణ మంజూరు చేసిన బ్యాంకర్లు. స్వయం సహాయ సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాన్ని ఇచ్చిన బ్యాంకర్లు. ముద్రా రుణాల కింద రూ.3189 కోట్లు మంజూరు చేసిన బ్యాంకులు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్‌ఎంఈ, ఎస్ హెచ్ జీ రంగాలకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో - మిగతా3లో



## గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుంది
- బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చు
- బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు
- దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం.



**విశాఖపట్నం**

ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియ లేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి (ఎఫ్35)', - మిగతా3లో



## కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?

- ప్రత్యేకించి కేంద్రంలో పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను కట్టడి చేయడానికి కూడా దీన్ని వాడవచ్చని కాంగ్రెస్ వ్యాఖ్యా
- బీజేపీయేతర పక్షాలు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తప్పించి ప్రభుత్వాలను అస్థిర పరచడానికి ఇది ఒక ఆయుధం అవుతుందన్న సందేహాన్ని పలువురు వ్యక్తం
- ఈ బిల్లుపై టీడీపీ, జేడీ(యూ)లు కూడా మథన పడుతున్నట్లుగా కనిపిస్తుంది.



## బీహార్ ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షుడి ఎంపికకు బీజేపీ సన్నాహాలు

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటనకు ముందే నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని యోచిస్తోంది
- త్వరలో అధికారికంగా ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు
- ఈసారి పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఇటీవల వార్తలు
- అందులో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ పురందేశ్వరీతోపాటు పలువురి పేర్లు

# ఐదు సర్వీసులకే @ ఫ్రీ బస్

-మొదటిపేజీ తరువాయి

సౌకర్యాలు మెరుగుపరిచారు. ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఆధార్, ఓటరు లేదా రేషన్ కార్డును గుర్తింపు కార్డుగా చూపించవచ్చు. వారికి జీరో ఫేర్ టికెట్లు ఇస్తారు.

**రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఫ్రీ అన్నారుగా**

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు చెప్పింది. ప్రభుత్వం ఏర్పాటైన 15 నెలల తర్వాత కానీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించలేదు. పైగా ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు అని హామీ ఇచ్చి, పథకాన్ని కేవలం 5 రకాల బస్సుల్లో (పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్) మాత్రమే వర్తింపజేయడంపై మహిళల్లో కొంత అసహనం కనిపిస్తోంది. నెలకు రూ. 300 కోట్లు ఖర్చు చేస్తే చాలు అన్ని బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని అమలు చేయొచ్చని, 2 కోట్ల మంది మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆమాత్రం ఖర్చు చేయలేదా అని వైయస్సార్సీపీ విమర్శిస్తోంది. ఫ్రీ బస్ పథకం అమలుపై అధ్యయనం పేరుతో కూటమి ప్రభుత్వం దాదాపు 15 నెలల సమయం తీసుకుంది. చివరికి తెలంగాణలో ఏ విధంగా అమలు చేస్తున్నారో అదేవిధంగా ఈ పథకాన్ని ఏపీలోనూ అమలు చేశారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ దేశంలో తొలిసారి కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల నుంచే అమలు చేస్తోంది. తెలంగాణలో ఏడాది నుంచి అమలు జరుగుతోంది. మరి అధ్యయనం పేరుతో 15 నెలల సమయం తీసుకున్న కూటమి ప్రభుత్వం అంత కన్నా మెరుగ్గా పథకాన్ని అమలు చేస్తామని చెప్పి, కండిషన్లు పెట్టడం ఎంతవరకు న్యాయం? దేశంలోనే అత్యంత సీనియర్ ముఖ్యమంత్రిగా ఉన్న సీఎం చంద్రబాబు ఇలా చేయాల్సింది కాదు. దీనిపై ప్రతిపక్ష వైయస్సార్సీపీ పదే పదే కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నా, మంత్రులు కానీ ఎమ్మెల్యేలు కానీ దానిపై నోరు మెదడపం లేదు. వారికి సమాధానం చెప్పలేకపోతున్నారు. ఇది ఖచ్చితంగా కూటమి ప్రభుత్వానికి మైనస్సే. దీని ప్రభావం ఇప్పటికిప్పుడు కనిపించకపోయినా భవిష్యత్తులో ఖచ్చితంగా ఉంటుందనేది వాస్తవం. వాస్తవానికి ఉచిత బస్సు పథకం మీద మహిళలు ఎంతోమంది ఆశలు పెట్టుకున్నారు. ఇంకా చెప్పాలంటే దేశంలో అన్ని పుణ్యక్షేత్రాలకు ఉచితంగా తిరిగి రావొచ్చని టీవీ యాడ్స్ పేరుతో కూటమి నాయకులే మహిళలకు ఆశలు కల్పించారు. కానీ తీరా అమలు చేసే నాటికి 5 రకాల బస్సుల్లో మాత్రమే అంటూ కండిషన్లు పెట్టి ఉసూరుమనిపించారు. దీంతో పథకం అమలైన తర్వాత రాష్ట్రంలో అంత బజ్ కనిపించడం లేదు.

**ఎక్స్ ప్రెస్ ని నాన్ స్టాప్ సర్వీసులుగా మార్చేశారా?**

ఉచిత బస్సుల్లో తెలంగాణలో జరిగినంత దారుణంగా మహిళల కొట్లాటలు ఆంధ్రాలో లేకపోవడం కొంతవరకు ఉపశమనం కలిగించే విషయం. అయితే దీన్నే మరోవిధంగా పథకం ఫెయిలైందని మహిళల నుంచి స్పందన లేదని ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయి. మహిళల్లో అంత గొప్ప స్పందన ఉంటే సీట్ల కోసం పోటీ పడేవారని, ఆ తరుణంలో ఇలాంటి సిగపట్లు లాంటి ఘటనలు జరుగుతుంటాయని వారు విశ్లేషిస్తున్నారు. మేం ఎక్కువ బస్సుల్లో అవకాశం కల్పిస్తున్నాం కాబట్టే ఇలాంటి కొట్లాటలకు అవకాశం ఉండదని ప్రభుత్వం వాదిస్తోంది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పేరుకు 1,560 ఉన్నాయి. కానీ వాటిలో దాదాపు 950 సర్వీసులు నాన్ స్టాప్ సర్వీసులే. అంటే వాటిలో ఉచిత ప్రయాణం పథకం వర్తించదు. కేవలం జిల్లాలో కొన్ని పల్లెలు, పట్టణాల మధ్య తిరిగే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, నగరాల్లో సిటీ ఆర్డినరీ సర్వీసుల్లోనే ఉచిత ప్రయాణం పథకం అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే మహిళలు టికెట్ లేకుండా రాష్ట్రం అంతా కాదు కదా కనీసం తమ జిల్లా అంతా కూడా ప్రయాణించే అవకాశం లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో కేవలం ఒక్క కేటగిరీలోనే అంటే సాధారణ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనే ఉచిత ప్రయాణం అందిస్తామని చెప్పింది. పోనీ సాధారణ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో అయినా పూర్తిగా ఈ పథకాన్ని అమలు చేస్తారా అంటే అదీ లేదు. నాన్ స్టాప్ సర్వీసుల్లో ఈ పథకం అమలు చేయబోమని ప్రకటించింది. ఆర్టీసీ చాలా ఏళ్లుగా రెండు పట్టణాల మధ్య సాధారణ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నిలిపివేసింది. వాటిని నాన్ స్టాప్ సర్వీసులుగా మార్చడం ద్వారా మహిళలను ఇబ్బంది పెట్టడమేనని వైయస్సార్సీపీ చేస్తున్న వాదనకు సమాధానం చెప్పుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది.

**ఆటో డ్రైవర్ల ఆవేదన అర్థం చేసుకోరా?**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తామని ప్రకటించినప్పుడే ఆటో, క్యాబ్ డ్రైవర్ల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. అవన్నీ దాటుకుని మహిళల మూకుమ్మడి ఓట్లతో కూటమి ప్రభుత్వం భారీ విజయం సొంతం చేసుకుంది. మొత్తానికి ఏడాది తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల సాకారమైంది. సాధారణంగా ఆటల్లో ప్రయాణించే వారిలో ఎక్కువ శాతం మహిళలే ఉంటారు. మగవారు అత్యవసరమైతే తప్ప ఆటోలో వెళ్లేది ఉండదు. టూవీలర్ లేదా కారుల్లో వెళ్తారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో మహిళలు డబ్బులు చెల్లించి ఆటోల్లో వెళ్లడానికి అంతగా ఆసక్తి చూపకపోవచ్చు. ఇదే ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ఆటోలు నడిపి కుటుంబాలను పోషించుకుంటున్న వారంతా ఇప్పుడు అయోమయంలో పడిపోయారు. ఆటోలను నడుపుకుని జీవనం సాగించే కుటుంబాలు ఇప్పుడు రోడ్డున పడే ప్రమాదం ఉంది. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించే ఆలోచన చేయకపోవడం బాధాకరం. పథకం అమల్లోకి వచ్చి కేవలం పది రోజులే అయినందున ఇప్పటికిప్పుడు దీని ప్రభావం కనిపించకపోవచ్చు. రెండు మూడు నెలలు గడిస్తే తప్ప, దీనిపై అధ్యయనం సాధ్యంకాదు. అప్పుడు తీసుకోబోయే లెక్కలను బట్టే ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చేమో చూడాలి.

**మహిళలు ఏమంటున్నారు?**

ఉచిత బస్సు పథకం అమలు చేయడం పట్ల గ్రామీణ మహిళలు కొంత సంతోషంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. పల్లెల నుంచి సమీప టౌన్ వరకు ప్రయాణం చేయాలంటే అందుబాటులో ఉండేవన్నీ పల్లె వెలుగు బస్సులే. వాటిలో ఎలాగూ ప్రభుత్వం ఉచితంగానే అవకాశం ఇస్తోంది. కాకపోతే నాన్ స్టాప్ బస్సుల్లో ఇవ్వకపోవడాన్ని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా పనుంటే తప్ప మేమేమైనా రోజూ బస్సుల్లో తిరుగుతున్నామా నాన్ స్టాప్ బస్సులకు కూడా ఉచిత ప్రయాణం అమలు చేసుంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇతర సూపర్ లగ్జరీ, వెన్నెల, అమరావతి, గరుడ వంటి బస్సుల్లో కనీసం 50 శాతమైనా ఇస్తే డిస్కౌంట్ ఇస్తే బాగుండని మాట్లాడుకుంటున్నారు. ఏదేమైనా కనీసం మూడు నెలలైనా గడవకుండానే ఈ పథకం గురించి పూర్తి విశ్లేషణ చేయడం కూడా సమంజసం కాదేమో.. మహిళల స్పందన ఎలా ఉంటుందో మరో మూడు నెలలు వేచి చూద్దాం.

# పీ4 కిందకు 13 లక్షల కుటుంబాలు

**విజయవాడ :** ఈ ఏడాది ఉగాది నాడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా..అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు. దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్థోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు. గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళుతున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుండా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని, తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉపయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెస్తాం" అని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**పీ4 అంటే??**

రాష్ట్రంలోని పేద కుటుంబాలను గుర్తించి సాధికారతను కల్పించటమే పీ-4 ప్రోగ్రాం ఉద్దేశ్యం. సంపద అధికంగా ఉన్న ఫ్యామిలీలను మార్గదర్శులుగా ఉంటారు. వీరు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా గ్రామా, వార్డుల్లో నిర్వహించే సర్వే, గ్రామసభల ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

# యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా

**విజయవాడ :** ఏపీలో పలుచోట్ల యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టామని వెల్లడించింది. విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేశామని? జిల్లాల వారీ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లో యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరు ప్రభుత్వాలు కూడా యూరియా సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. యూరియా కొరత లేకుండా తక్షణమే సరఫరా చేయాలని కోరుతున్నాయి.యూరియా సరఫరా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ తెలిపింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని పేర్కొంది. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టింది.

2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది.




గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి. గత సంవత్సరం కంటే 2,19,311 మెట్రిక్ టన్నులు అధికంగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. యూరియా వినియోగం 2024లో 3,74,290 మెట్రిక్ టన్నుల నుంచి ఈసారి 4,57,727 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది 83,436 మెట్రిక్ టన్నుల అధిక వినియోగాన్ని సూచిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.డీఏపీ వినియోగం 1,17,582 మెట్రిక్ టన్నుల నుంచి 1,37,884 మెట్రిక్ టన్నులకు పెరిగింది. పొటాష్ వినియోగం 39,054 మెట్రిక్ టన్నుల నుంచి 54,276 మెట్రిక్ టన్నులకు పెరిగి 15,222 మెట్రిక్ టన్నుల మేర పెరిగింది. యూరియా, ఎరువుల కొరత రాకుండా నెలవారీ సరఫరా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ తాజాగా వెల్లడించింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేస్తున్నారని? దీని వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్ ఫెడ్ కు ఎరువుల కేటాయింపులను పెంచుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల్లో ఇకపై 70 శాతం ఎరువులను మార్క్ ఫెడ్ కు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్టుకు తరలించిన వారిపై కేసులు పెట్టాలని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

## ఖరీఫ్ రుణ లక్ష్యం రూ.1,80,540 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

బ్యాంకింగ్ సేవలపై సమీక్ష. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రపెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చ. ఎస్ఎల్ బీసీ సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలి. రోటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, ఇండికేటర్లు కూడా రోటీన్ గా మారుతున్నాయి. ఖరీఫ్ లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయింది. ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్ పుట్ ఇవ్వాల్సి ఉంది. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ తీరు మార్చుకోవాల్సి ఉంది. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చింది. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరు, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలనూ చేపట్టాలి. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి నేను ఆలోచన చేస్తున్నాను. ఓ దశలో సంపద సృష్టి కోసం పరిశ్రమల కోసం దావోస్ లాంటి ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువు పొడిగింపు..

అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువును పొడిగింది. టెండర్ల డెడ్‌లైన్‌ను ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది ప్రభుత్వం రాష్ట్రంలోని 840 బార్లకు కొత్త పాలసీని రూపొందించింది. ఈ పాలసీ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల పై మద్యం వ్యాపారులు ఆసక్తిగా లేరు. దీంతో టెండర్ల గడువు సమీపిస్తున్నా వారి నుంచి ఆసక్తి కనిపించటం లేదు నిజానికి మంగళవారం సాయంత్రంతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే ఇప్పటివరకు 43 బార్లకు మాత్రమే 4 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం 437 దరఖాస్తుల్లో 43 షాపులకు 4 చొప్పున 132 దరఖాస్తులు వచ్చాయి. మిగతా వాటికోసం కేవలం సింగిల్, డబుల్ అప్లికేషన్లు మాత్రమే రావడంతో ఎక్సైజ్ అధికారులు ఖంగుతిన్నారు బార్ అండ్ రెస్టారెంట్ పాలసీలోనే లోపాలు ఉన్నాయని, దరఖాస్తులు చేయకూడదని వ్యాపారులు నిర్ణయించుకున్నారు. డెడ్‌లైన్ ముగుస్తున్నా దరఖాస్తులు రాకపోవడంతో తుది గడువును ప్రభుత్వం 29 వరకు పెంచింది. అయినా సరే అప్లికేషన్లు పెట్టబోమని మద్యం వ్యాపారులు చెబుతున్నారు. పాలసీలో మార్పులు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఆచరణ సాధ్యం కాని పాలసీని తీసుకొచ్చారని వ్యాపారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

-మొదటిపేజీ తరువాయి

'హిమగిరి(ఎఫ్34)'లను విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం ఈ నౌకల సొంతం. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. "స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ నౌకలు ప్రతీక. ఆత్మనిర్భర్ భారత్‌కి ఇవి నిదర్శనం. సాంకేతిక పరిజ్ఞానం ఈనౌకల తయారీలో ప్రతిబింబిస్తోంది. 2050 నాటికి 200 యుద్ధనౌకలు నిర్మాణం చేస్తాం" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# క్షేత్రస్థాయి పటిష్టతపై జనసేన దృష్టి



**విశాఖపట్టణం :** జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధమవుతుంది. అందుకే విశాఖలో మూడు రోజులపాటు విస్తృత స్థాయిసమావేశం నిర్వహిస్తున్నారు. ఆగస్ట్ 28వ తేదీ నుంచి 30వ తేదీవరకు మూడు రోజులు విస్తృత స్థాయి సమావేశం విశాఖ లో నిర్వాహిస్తున్నారు. ఈ మూడు రోజులు పాటు సేనతో సేనాని పేరిట జరిగే కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. 28వ తేదీన జనసేన లెజిస్టేటివ్ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేల నుంచి పవన్ కల్యాణ్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. పార్టీ క్షేత్రస్థాయిలో ఎలా ఉంది? కూటమి పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై ఎమ్మెల్యే అభిప్రాయాలను తెలుసుకుంటారు.టీడీపీ ప్రతి ఏటా నిర్వహించిన మహానాడు తరహాలో ఈ సమావేశాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని ఎప్పటి నుంచో ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ తమ మాట వినకుండా టీడీపీ ఇన్ ఛార్జుల మాటకే విలువ ఇస్తున్నారని, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇటీవల తరచూ ఎమ్మెల్యేలు చెబుతుండటంతో 28వ తేదీన జరిగే లెజిస్టేటివ్ సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చించే అవకాశముంది. ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయో తెలుసుకుని వాటిని టీడీపీ అధినేత చంద్రబాబు ముందు ఉంచే ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిసింది ఈతరం నేతలను గాడిన తేవడం కష్టమేనా? పార్లమెంటు నియోజకవర్గాల వారీగా... 28వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఆగస్ట్ 29వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పార్లిమెంట్ నియోజక వర్గాల వారిగా పదిమంది పార్టీ నేతలతో చర్చిస్తారు. అనంతరం పర్యావరణం , మహిళా బాధ్యత పై రక్షిత మంచినీటి పథకం, ఉపాధి క్షల్పన,మీద చర్చలు ఉంటాయి. కొత్త నాయకత్వం బయటకు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ రకమైన సమావేశాలు అని జనసేన చెబుతుంది. విపక్షం సోషల్ మీడియా వినియోగించి చేసిన దుష్ప్రచారంపై కూడా చర్చిస్తారు. ఏడాది నుంచి అందించిన సుపరిపాలన మీద చర్చ జరుగుతుంది. ఎన్నికలు గడిచి పథ్నాలుగు నెలలు కావడంతో ఇప్పటి వరకు పార్టీ శ్రేణులతో గడిపే సమయం లేకపోవడం తో ఇప్పుడు ఈ కార్యక్రమంతో పార్టీ నాయకులు, కార్య కర్తలతో పవన్ కళ్యాణ్ కలిసి ఉంటారు. ఈ నెల 30 వ తేదీ జనసేన మహా సభ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సభ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగం ఉంటుంది.ఇప్పటికే సేనతో సేనాని కార్యక్రమ పోస్టర్ ను మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను నాదెండ్ల పరిశీలించారు. క్యాడర్ లో ఉన్న అసంతృప్తిని పోగొట్టడానికి, కొత్త నాయకత్వాన్ని ఆహ్వానించడానికి, పార్టీలో, ప్రభుత్వంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని జనసేన నేతలు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా హాజరయి క్యాడర్, ఇబ్బందులను విని వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారని నమ్ముతున్నారు.

# మనసుతో స్నేహం చేయండి..మేధావులు కండి!

**హిప్నాటిజంతో విద్యార్థుల్లో అంతర్గత శక్తిసామర్థ్యాలను చూపుతున్న డా.హిప్నో పద్మా కమలాకర్**

**శ్రీకాకుళం,విశ్వంవాయిస్ న్యూస్:** హిప్నాటిజంతో విద్యార్థుల్లో అంతర్గత శక్తిసామర్థ్యాలను పెంపొందుకోవచ్చు,ప్రతి విద్యార్థి తన మనసుతోనే స్నేహం చేస్తే మేధావులు కావచ్చని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ -ఇండియా జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సైకలాజికల్ డిపార్ట్మెంట్ హెడ్ ప్రోగ్రాం కన్వీనర్ సంధ్యా రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ లో కీబోర్డ్,మౌస్ ఉపయోగించినట్లే... పంచేంద్రియాలు, ఊహాశక్తితో మానవ మేధస్సును ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే దాని కనుగుణంగా మేధస్సు సమీకృతం చేసుకోవచ్చన్నా రు. న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్ (ఎన్.ఎల్.పి) ఆధారంగా అదేవిధంగా సాధ్యమో ఆచరణాత్మకంగా విద్యార్థులకు నేర్పించారు. భవిష్యత్ పట్ల ఆకాంక్ష చదువుపై ఆసక్తి, ఏకాగ్రత ను ఏర్పరుస్తుందన్నారు. తద్వారా గ్రహణశక్తి పెరిగి జ్ఞాపకం వుంచుకోగల్గుతా రన్నారు. అధిక సమయం విరామం లేకుండా చదివితే మెదడు లో ఆక్సిజన్, గ్లూకోజ్ స్థాయిలు తగ్గి గ్రహణం సామర్థ్యం సన్నగిల్లుతుందన్నారు. అందుకే ప్రతి 45 నిముషాలకు పది నిమిషాలు విరామం ఇవ్వాలన్నారు. ఆ విరామంలో పుస్తకం మూసి అప్పటి వరకు చదివిన విషయాలను నెమరు వేసుకోవాలన్నారు. అలా ఆ విషయాలు వచ్చేదాకా చదవాలన్నారు. అనంతరం 7రోజులకు, 21రోజులకు, 42 రోజులకు పునశ్చరణ చేస్తే శాస్వతంగా జ్ఞాపకం





వుంటాయన్నారు. పరీక్షలంటే భయానికి కారణం... తాము నేర్చని విషయాలు పరీక్షా పత్రం లో వస్తాయేమోనన్న అనుమానమేనన్నారు. ఎంత మేధావులైనా తమకు తెలియని విషయాలు చెప్పడం, రాయడం చేయలేరన్నారు. తాము నేర్చిన మేరకు పరీక్ష పత్రంలో ఏమిచ్చినా రాయగలనన్న విశ్వాసంతో విద్యార్థులు పరీక్ష భయాన్ని అధిగమించవచ్చన్నారు. మనుషుల అంతర్గత శక్తి సామర్థ్యాలను ఆవిష్కరించే మనో విజ్ఞానమే "హిప్నాటిజం" అన్నారు. సూచనలతో మానసిక, శారీరక స్థితిగతులను, సామర్థ్యాలను ప్రేరేపించవచ్చని ఆచరణాత్మకంగా చేసి చూపించారు.మూడు కుర్చీలపై ట్రాన్స్‌లో వున్న వ్యక్తిని పడుకోబెట్టి ఇనుపకడ్డీలా మార్చి మధ్య కుర్చీ తొలగించారు. అప్పుడు రెండు కుర్చీలమధ్య వంతెనలా పడుకున్న ఆ వ్యక్తిపై ఇద్దరు మనుషులను నిలబెట్టినా ఆవ్యక్తి ఏమాత్రం చలించకపోవడం విద్యార్థులను ఆశ్చర్య వంతులను చేసింది. శారీరకంగా ఏ శక్తినైతేచూస్తున్నారో మానసికంగా మేధోపరంగా మీలో ఆశక్తిఉంది...దానిని వినియోగిస్తే శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చు కోవడం ద్వారా శీఘ్రగతిన అభివృద్ధిని సాధించవచ్చ న్నారు. తెలుగు సినిమా, ఇంగ్లీష్ సినిమా అనుకోని పరీక్షలకు వెళ్లాలన్నారు. ఇంకొకరితో పోల్చుకోవడం చేయకోడదన్నారు.ఎవరి శక్తి సామర్థ్యాలు వారివే నన్నారు. ఎలా, ఎప్పుడూ చదవాలో టెక్నిక్స్ ద్వారా ప్రాక్టీస్ చేయించారు. విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు వీసీ ఆచార్య కె.ఆర్. రజని మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదగాలన్నారు.రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, ప్రధానాచార్యులు మురపాన అనురాధ, సీహెచ్. రాజశేఖర రావు, కార్యక్రమ సమన్వయకర్త జేఎల్ సంధ్యా రాణి, పాల్గొన్నారు.

# మదర్ తెరిసా జయంతి వేడుకల్లో ఆదిత్య కళాశాల సేవలు

**బట్టలు,పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన ఆదిత్య వాలంటీర్లు**

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్: స్థానిక శ్రీగౌతమీ కారుణ్య సంఘం వృద్ధులకు, రోగులకు చీరలు,పంచలు, టవల్స్, పళ్ళు,బ్రెడ్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి ఆదిత్య ఎన్.ఎస్. ఎస్,యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు,ఆదిత్య డిగ్రీ కళాశాల, యానిమేషన్ డిగ్రీ మరియు పీజీ కళాశాల,ఆదిత్య బిజినెస్ స్కూల్ కు చెందిన వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ రాజమండ్రి రివర్ సిటీకి అధ్యక్షులు ఎల్ శ్రీనివాస రావు,ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి పాల్గొన్నారు. గా గంగిరెడ్డి మాట్లాడుతూ 2003 నుండి ఇప్పటివరకు తాము వస్త్రాలు పండ్లు, బ్రెడ్లు పంచడం జరుగుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ స్కూల్ కు చెందిన ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ మాట్లాడుతూ తన వాలంటీర్లు ప్రతివారం పరిసరాల శుభ్రం చేయడం, నిన్నటి రోజున పది అడుగుల మొక్కలు 50 నాటడం ఎంతో ఆనంద కరమనిచెప్పారు. రోటరీ క్లబ్ తరఫున తాము ఏ సేవా కార్యక్రమానికైనా ఆదిత్య వాలంటీర్లతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షులు శ్రీనివాసరావు చెప్పారు. మరొక వ్యక్త మాట్లాడుతూ వాలంటీర్లు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఆదిత్య ఇలా చేయడం తనకు గర్వకారణంగా ఉందని ఆమె ఈ సందర్భంగా



వాలంటీర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్. ఎస్. ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డా. బిహెచ్ వి. రమాదేవి మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమంలో పాల్గొనడానికి సహాయం చేయడమే కాకుండా ఎంతో చురుకుగా ఉత్సాహంగా వృద్ధులను అందరినీ తాతయ్య,అమ్మమ్మ, నాన్నమ్మఅని పలకరిస్తూ వారి మంచం మీద కూర్చుని, చేతులు పట్టుకుని భుజం మీద చేయి వేసి ఎంతో ప్రేమగా మాట్లాడడం,వారు కూడా స్పందించి వాలంటీర్లకు ఆశీస్సులు అందజేయడం, అక్కడ ఉన్న వాళ్ళ కళ్ళు చెమర్చాయని ఆమె చెప్పారు.ఆమె ఐశ్వర్యారాయ్ కావాలంటే అందంగా ఉండాలి మదర్ తెరిసా కావాలంటే మనసుంటే చాలని యండమూరి వీరేంద్రనాథ్ సూక్తిని ఈ సందర్భంగా యండమూరి చెప్పిన సూక్తి ని గుర్తు చేసుకుంటూ మీరెవరూ తల్లిదండ్రులను ఇలా వృద్ధాశ్రమానికి పంప కండి అని భావోద్వేగానికి లోనయ్యారు.జి. వి..ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2003 నుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం ఇదే విధంగా బట్టలు పంచుతూ న్యూట్రీషియస్ ఫుడ్ ఇస్తున్నామని, రాఖీ పౌర్ణమి కూడా వికలాంగులకు ఇదేవిధంగా పంచామని, తాను కరోనా సమయంలో కూడా ఖాళీ లేకుండా సేవలు చేయడం ఆనందకరమనీ, తనని ఈ విధంగా తీర్చిదిద్దిన చైర్మన్ డా.నల్లమిల్లి శేషారెడ్డి, రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థలు డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి లకు ఎల్లప్పుడూ కృతజ్ఞతగా ఉంటానని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పోలుకొండ సాయి ఆకుల శిరీష,యానిమేషన్ కి చెందిన బి.విమల సీనియర్ నాయకులు సూర్య,మనోజ్, సందీప్, వినయ్,మౌనిష్, సుమ, యశస్విని,వర్షిణి, సి, శ్రావణి,జైదీప్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ చోర్ యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన

- బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తోంది..
- ఎన్ఎస్‌యుఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజీవ్ గాంధీ
- నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళి ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోర్%-%గద్దె చోడ్ నిరసన కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవతారకేష్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ చౌక్, జాంపేట ప్రాంతాల్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ఎస్‌యుఐ జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ఇన్‌చార్జ్ రాజీవ్ గాంధీ, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ మనీష్ తివారీ, పిసిసి సభ్యుడు బోడ వెంకట్, కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ హాజరుకాగా, చింతాడ





వెంకటేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చామర్తి లీలావతి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జాంపేటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం భారీగా తరలివచ్చిన ఎన్ఎస్‌యుఐ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుందని రాజీవ్ గాంధీ అన్నారు. ఈసి ని బీజేపీ తన జేబు సంస్థగా మార్చుకుని సామాన్యుల ఓట్లు తొలగించి బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ బీహార్‌లో నిర్వహిస్తున్న ఓట్ చోర్ యాత్రకు అక్కడి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి సామాన్య, మధ్య తరగతి ప్రజల ఓట్లు తొలగించకుండా చూడాలని రాహుల్ గాంధీ ఉద్యమం చేస్తున్నారన్నారు. బీహార్‌లో అధికారం దక్కించుకోవాలనే కుట్రలో భాగంగా బీజేపీ ఇసిని అడ్డుపెట్టుకుని ఓట్ల చోరీకి పాల్పడిరదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓటేసే వారి ఓట్లను తొలగించడం ద్వారా లబ్ధి పొందాలని చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కాంగ్రెస్ పార్టీతో పాటు అనుబంధ విభాగాలు పెద్దఎత్తున ర్యాలీలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపడుతున్నాయని తెలిపారు. ఎన్ఎస్‌యుఐ నాయకులు వేముల శ్రీనివాస్, నరాల సాయి, నంద కిషోర్, పెనుగొండ పవన్, కార్తీక్, షమీ, పోసికుమార్, సంపత్, కాంగ్రెస్ నాయకులు యిజ్జరౌతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 13వ డివిజన్‌లో స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

### రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్

**రాజమహేంద్రవర,విశ్వం వాయిస్ న్యూస్:** రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేయడం మంచి ఆలోచన అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే నగరంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక 13వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని రేషన్ షాపు



సమీపంలోని వద్ద లబ్ధిదారులకు ఆ స్మార్ట్ రైస్ కార్డులను ఇంటింటికీ వెళ్లి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది తమ కూటమి ప్రభుత్వానికి వచ్చిన స్మార్ట్ ఆలోచన అని అన్నారు. గతంలో మాదిరిగా పెద్ద పుస్తకాల వలే కాకుండా ఏటిఎం, ఆధార్ కార్డుల తరహాలో రాజముద్రతో పాటు లబ్ధిదారు చిత్రం ఉండే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ స్మార్ట్ రైస్ కార్డులను రూపొందించడం జరిగిందన్నారు. సదరు కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరుకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు తెలుస్తాయన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో ఎక్కడి వారైనా... ఎక్కడి నుంచ్కెనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం నగరంలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని అవన్నీ కూడా ప్రాసెస్ చేయడం జరిగిందన్నారు. అర్హులందరికీ కార్డులు ఇవ్వడం జరుగుతోందన్నారు. అయితే గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. వైకాపా జారీ చేసిన రేషన్ కార్డుల్లో వారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత కడప ఎమ్మెల్యే జగన్ ఫొటోలు ముద్రించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అటువంటి తప్పులు చేయకుండా కేవలం రాజముద్ర, మరియు లబ్ధిదారుల ఫొటోలను మాత్రమే ముద్రించిందని అన్నారు. కాగా నగరంలో ఉన్న 83,547 కార్డులకు గాను 82,322 స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మిగిలినవి అందుబాటులో లేకపోవడం, వేరే ప్రాంతాలకు వెళ్లడం జరిగిందన్నారు. 13వ డివిజన్ ఇన్‌ఛార్జ్ కప్పల వెలుగు కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడలి రామకృష్ణ, మరుకుర్తి రవి యాదవ్, బొర్రా చిన్ని, నగరబోయిన రామకృష్ణ, చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, వై దేవీప్రసాద్, కరగాని వేణు, రాయి అప్పన్నబాబు, ఈతలపాటి రవి, మల్లెల శ్రీనివాస్, మళ్ల వెంకటరాజు, సలాది ఆనంద్, మామిడి శ్రీను, బర్ల గిరిజ, కానేటి ప్రభుదాసు, కానేటి కృపామణి, చిన్ని, అధిక సంఖ్యలో మహిళలు, రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తల ముఖాముఖి కార్యక్రమం

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక అభివృద్ధిని కల్పిస్తుందని మండల పేదరిక నిర్మూలన సంస్థ ఎస్ ఈ ఆర్ పి అదనపు ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీరాములు నాయుడు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని మండల వెలుగు కార్యాలయం నందు మహిళా పారిశ్రామికవేత్తల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలనే సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయన్నారు మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని వారితోపాటు మరికొంతమందికి ఉపాధిని కల్పించడంలో మహిళలు ముందు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డి ఏ ఎస్ ఈ ఆర్ పి ప్రాజెక్ట్ డైరెక్టర్ యెన్ వి ఎస్ ఎస్ మూర్తి, ఏ పి డి సత్యనారాయణ, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వినయ్ కుమార్,బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీనివాస్, సిజ్జి బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, మండల పేదరిక నిర్మూలన సంస్థ ఏపీఎం నిర్మల, మహిళ వ్యాపారస్తులు వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి భాద్యత

**గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ అధ్యర్యంలో ఉచిత మట్టి గణపతి ప్రతిమల పంపిణి**


**జాతీయ అధ్యక్షులు నాగేశ్వరరావు,టి.కే విశ్వేశ్వర్ రెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** వినాయక చవితి పర్యావరణ కలుషితం కాకుండా మట్టి గణపతితో జరుపుకోవాలని గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ జాతీయ అధ్యక్షులు వరదా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కంబాల చెరువు టాక్సీ స్టాండ్ వద్ద గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ అధ్యర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ జాతీయ అధ్యక్షులు వరదా నాగేశ్వరరావు, తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కె విశ్వేశ్వర రెడ్డి చేతుల మీదుగా ప్రతిమలు అందజేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకుణ్ణి పూజచేయడం వల్ల పర్యావరణానికి హాని జరగకుండా ఉంటుందని అందరూ పూజలో మట్టి ప్రతిమలను వాడాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఏడాది ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని అన్నారు. టి కె విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ అధ్యర్యంలో మదర్ దెరెస్సా 116వ జయంతి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పంచిపెట్టడం గొప్ప కార్యక్రమమని రాజమండ్రి అంత కూడా మురికి నీరు, వివిధ రకాల చెత్త చెదారాలతో కాలుష్యమై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితుల్లో ఈ మట్టి విగ్రహాలను పూజ చేయండి పర్యావరణాన్ని పరి రక్షించండి అని ప్రజలకు ఒక సందేశం ఇవ్వడం గొప్ప పరిణామ మని అన్నారు. గార్డ్స్ అధ్యర్యంలో జరుగుతున్నా ఈ కార్యక్రమాన్ని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. మహిళా కార్యదర్శి విజయ భారతి మాట్లాడుతూ మదర్ దేరిస్సా స్ఫూర్తితో ఈ రోజు ఈ కార్యక్రమానికి సంకల్పించమని అన్నారు. ముందుగా మదర్ దేరిస్సా చిత్రపటానికి సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మరుకుర్తి రవియాదవ్, వెంట్రప్రగడ ఉమా మహేశ్వరీ, గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ సభ్యులు దాలిపర్తి వేమన,పిల్లి నిర్మల,లక్ష్మి ఏజన్సీస్ భారత్ పెట్రోల్ బంక్ యజమాని కర్రి సతీష్ రెడ్డి,దామిశెట్టి నాగరాజు, చిలుకూరి నాగేశ్వరరావు, మహ్మద్ ఇస్మాయిల్, దొమ్మేటి శంకరం,ఏ. వి. వి. సత్యనారాయణ, జర్నలిస్టులు వి.రవికుమార్,రత్నకిషోర్ కుడేల్లీ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య వాలంటీర్లు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్ ఎస్ ఎస్,యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు కలసి పర్యావరణానికి హితమైన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ



చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ అలీ ఖాన్,హెడ్ కానిస్టేబుల్ మొహమ్మద్ అలీ,మహిళా రక్షక్ టీమ్ సభ్యుడు సతీబాబు మరియు ఇతరులు పాల్గొన్నారు. వాలంటీర్లు మొత్తం 500 గణేశ్ విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాళ్లు డి.రామకృష్ణ, కె.వి. శ్రీరామ్, విమల పాల్గొన్నారు.టీమ్ లీడర్లు యశస్వి, స్రవని, సూర్య,గణేష్,కె.సుధాకర్ పట్నాయక్,డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ప్రపంచ రికార్డుల ప్రస్థానానికి ఆరంభం

1955 ఆగస్టు 27న బ్రిటన్‌లో వెలువడిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక, మానవ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాసింది. ఇప్పటి వరకు వ్యక్తుల వ్యక్తిగత కీర్తి, దేశాల ప్రత్యేకతలు, ప్రకృతి అద్భుతాలు విడివిడిగా పత్రికల్లో, పుస్తకాలలో నమోదు అయ్యేవి. కానీ వాటిని ఒకే చోట సమీకరించి, శాస్త్రీయంగా వర్గీకరించి, ప్రజలకు సులభంగా అందించే ప్రయత్నం ఇదే తొలిసారి. ఆ తొలి సంచికతోనే ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందింది. కాలక్రమేణా ఇది కేవలం ఒక పుస్తకమే కాకుండా, మానవ ప్రతిభ, కృషి, కల్పన, విచిత్రతలకు ప్రతిబింబంగా మారిన వేదికగా నిలిచింది. ఈ ఆలోచనకు బీజం 1951లో ఐర్లాండ్‌లో వేసిన ఒక వేట సంఘటన లో పడింది. గిన్నిస్ బ్రూవరీస్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ హ్యూ బీవర్, తన మిత్రులతో కలిసి వేటలో పాల్గొన్నప్పుడు "యూరప్‌లో అత్యంత వేగంగా ఎగిరే పక్షి ఏది?" అన్న ప్రశ్నపై వాదన ప్రారంభమైంది. వారు అందుబాటులో ఉన్న పుస్తకాలు తిరగేసినా తగిన ఆధారాలతో కూడిన సమాధానం దొరకలేదు. ఈ సంఘటన బీవర్ మదిలో ఒక వినూత్న ఆలోచనకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ప్రశ్నలకు, వాదనలకు ముగింపు పలికి, సమగ్ర సమాచారం అందించే ఒక గ్రంథం అవసరమని ఆయన గ్రహించారు. తన ఆలోచనను ఆచరణలోకి తీసుకు వెళ్లేందుకు బీవర్ లండన్‌లో గణాంక సేకరణలో ఖ్యాతి పొందిన కవల సోదరులు నోరిస్ మెక్‌విర్టర్, రాస్ మెక్‌విర్టర్‌లను సంప్రదించాడు. వీరు అప్పటికి ఫాక్ట్ ఫైండర్స్ ఏజెన్సీ పేరిట సమాచార సేకరణ సంస్థను నడుపు తున్నారు. గిన్నిస్ సంస్థ ఆర్థిక సహకారంతో ఈ సోదరులు విస్తృతంగా పరిశోధనలు చేసి, వివిధ రంగాల నుంచి రికార్డులను సేకరించారు. క్రీడలు, ప్రకృతి, శాస్త్రం, సాంకేతికం, మానవ ప్రతిభ, కళలు, వినోదం వంటి విభిన్న విభాగాల్లోని విశేషాలను గణాంకాలతో సమీకరించి, పుస్తక రూపంలో కూర్చారు. అనేక నెలల శ్రమతో సిద్ధమైన ఈ గ్రంథం 1955 ఆగస్టు 27న లండన్ ఫ్లీట్ స్ట్రీట్‌లో విడుదలైంది. 197 పేజీలతో వెలువడిన ఆ తొలి సంచిక అద్భుతమైన విజయాన్ని సాధించింది. విడుదలైన మొదటి రోజే అది ప్రజల దృష్టిని ఆకర్షించింది. నాలుగు నెలల వ్యవధిలోనే అది బ్రిటన్‌లో అత్యధికంగా అమ్ముడైన నాన్-ఫిక్షన్ పుస్తకంగా నిలిచింది. ఆ సంవత్సరం క్రిస్మస్ సీజన్ నాటికి దాదాపు ప్రతి ఇంటికి చేరేంతగా అది ప్రాచుర్యం పొందింది. ఆ తొలి సంచికలోనే అనేక ఆసక్తికరమైన రికార్డులు చోటు చేసుకున్నాయి. అమెరికాకు చెందిన రాబర్ట్ వాడ్లో 8 అడుగులు 11 అంగుళాల ఎత్తుతో అత్యంత పొడవైన మనిషిగా గుర్తింపు పొందాడు. భారత దేశానికి చెందిన గుల్మ్ మహమ్మద్ కేవలం 57 సెంటీమీటర్ల ఎత్తుతో అత్యంత చిన్న మనిషిగా నమోదు అయ్యాడు. బ్రిటన్‌లో నడిచిన "మల్లార్డ్" స్టీమ్ లోకోమోటివ్ గంటకు 126 మైళ్ళ వేగంతో ప్రపంచం లోనే వేగవంతమైన రైలు కీర్తి సాధించింది. కాలిఫోర్నియా లోని బ్రిసిల్ కోన్ పైన్ సుమారు 4,000 ఏళ్ల వయసుతో అత్యంత పాత వృక్షంగా నిలిచింది. ప్రపంచం లోనే ఎత్తైన భవనం న్యూయార్క్ లోని "ఎంపైర్ స్టేట్ బిల్డింగ్"గా పేర్కొనబడింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ముద్రించ బడిన పుస్తకంగా బైబిల్ నమోదు అయింది. ఇవన్నీ పాఠకులను ఆకర్షించడమే కాకుండా, భవిష్యత్తు సంచికల పునాది వేయించాయి. ఈ పుస్తకం వెలువడిన రెండవ సంవత్సరానికే, 1956లో అమెరికాలో ప్రత్యేక సంచిక విడుదలైంది. తర్వాత ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లోనూ అనువాదాలు వచ్చాయి. కేవలం పది సంవత్సరాల్లోనే 3.5 మిలియన్ కాపీలు అమ్ముడై, ఒక అద్భుత ప్రచురణా చరిత్రను సృష్టించింది. 1960ల నాటికి ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ తాజా రికార్డులను సేకరించడం ప్రారంభమైంది. కాలక్రమేణా రికార్డులను సేకరించడం, ధృవీకరించడం శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన కఠిన ప్రక్రియగా మారింది. ఈ గ్రంథం ప్రభావం విశేషం. మానవులలోని పోటీ భావన, కృషి, విశ్వాసం, ప్రతిభను వెలికి తీసింది. అనేక మంది వ్యక్తులు, సంస్థలు గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించాలనే తపనతో కొత్త రికార్డులు సృష్టించేందుకు ప్రేరణ పొందారు.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

## సామాజిక న్యాయ యాత్రలో

# కాంగ్రెస్ సాహస యత్నం

భారత దేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ స్వాతంత్ర్యానంతరం సామాజిక న్యాయం సాధనకు ఒక ప్రధాన సాధనంగా నిలిచింది. ముఖ్యంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజ్యాంగం రిజర్వేషన్లను అనుమతించింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యమైనదిగా కనిపించినా, అది చట్టపర, న్యాయపర పరిమితుల కఠిన పరీక్షను తప్పనిసరిగా ఎదుర్కోవలసి ఉంటుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. కానీ ఈ చర్యలు సమానత్వ హక్కును ఉల్లంఘించ రాదు. అందుకే సుప్రీంకోర్టు తీర్పులు అత్యంత ప్రాధాన్యంగా మారాయి. 1992లో ఇంద్ర సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించ కూడదని స్పష్టం చేసింది. రిజర్వేషన్లు శాశ్వత పరిష్కారం కాదని, తాత్కాలిక సహాయక చర్యలుగా మాత్రమే ఉండాలని తీర్పు చెప్పింది. తరువాత 2019లో కేంద్రం ఆర్థికంగా బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేసింది. కానీ 50 శాతం పరిమితి ఇప్పటికీ రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని కోర్టు పునరుద్ఘాటించింది. 2021లో మహారాష్ట్రలో మరాఠా వర్గానికి ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించగా, మొత్తం రిజర్వేషన్లు 60 శాతం దాటాయి. దీనిని సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు స్వయంగా కుల గణన చేయలేవని, ఆ అధికారం కేంద్రమే కలిగినదని స్పష్టం చేసింది. ఈ తీర్పు తరువాత 50 శాతం పరిమితి మరింత బలమైన న్యాయపర అవరోధంగా నిలిచింది. రాష్ట్రాల అనుభవాలు కూడా దీనిని బలపరుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నించినా, 50 శాతం పరిమితి కారణంగా కేంద్ర ఆమోదం లభించలేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులను బీసీ జాబితాలో చేర్చాలని చేసిన ప్రయత్నం కూడా ఇదే కారణంతో అమలులోకి రాలేదని ఉదాహరణలు చూపుతున్నాయి. కేవలం రాష్ట్రం చట్టం చేస్తే సరిపోదుబీ కేంద్ర అనుమతి, రాజ్యాంగ సవరణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా అనుసరించాలి. కాబట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే మొదట రాష్ట్ర శాసనసభలో చట్టం ఆమోదం పొందాలి. ఆ తరువాత గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం అవసరం. ముఖ్యంగా 50 శాతం పరిమితిని




ఎత్తివేయాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. ఆ సవరణ కూడా సుప్రీంకోర్టు పరీక్షను తప్పని సరిగా ఎదుర్కోవాలి. ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ అనుభవజ్ఞులైన న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీనివల్ల చట్టపరమైన ఆటంకాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. సామాజిక వాస్తవాల పరంగా చూస్తే బీసీలు దేశ జనాభాలో అత్యధిక వర్గమని అనేక అధ్యయనాలు నిర్ధారించాయి. 2023లో బీహార్‌లో జరిగిన కుల గణనలో బీసీలు 63 శాతం ఉన్నారని వెల్లడైంది. దేశవ్యాప్తంగా కూడా బీసీలు జనాభాలో సగానికి మించిన వారని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ పెంపు డిమాండ్ బలపడుతోంది. కానీ అది నేరుగా అమలు కావాలంటే కేంద్ర ఆధ్వర్యంలో కుల గణన జరగడం, బీసీల వెనుకబాటు తనాన్ని శాస్త్రీయ ఆధారాలతో నిరూపించడం, 50 శాతం పరిమితిని తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయడం, అంతేకాదు రిజర్వేషన్లతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక వనరులలో బీసీలకు ప్రత్యేక పథకాలు రూపకల్పన చేయడం తప్పనిసరి. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం రాజకీయంగా బీసీ ఓటు బ్యాంక్‌ను ఆకర్షించే వ్యూహంగా ఉన్నా, న్యాయపర పరిమితులను అధిగమించకుండా ఇది ఆచరణలోకి రావడం కష్టసాధ్యం. వాస్తవానికి బీసీల శక్తివంతీకరణకు చట్టపర, న్యాయబద్ధ చర్యలతో పాటు ఆర్థిక -విద్యా అవకాశాల విస్తరణే ప్రధాన మార్గం. కేవలం రిజర్వేషన్లే కాక సమగ్ర అభివృద్ధి చర్యల ద్వారానే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్ల నిర్ణయం సామాజిక న్యాయం వైపు అడుగైనా, అది ఇంద్ర సాహ్నీ తీర్పు, మరాఠా కేసు తీర్పు, రాష్ట్రాల గత అనుభవాల వెలుగులో తప్పనిసరిగా కఠిన న్యాయపర పరీక్షను ఎదుర్కొంటుంది. చట్ట, న్యాయ పరిమితులలో ఉండకపోతే లక్ష్యం నెరవేరదు. కానీ కుల గణన, రాజ్యాంగ సవరణ, ప్రత్యేక అభివృద్ధి పథకాల సమన్వయం జరిగి న్యాయ నిపుణుల సూచనలతో ముందుకు సాగితేనే బీసీలకు వాస్తవ ప్రయోజనం కలుగుతుంది.

# సకల సంకట నివారకుడు వినాయకుడు

త్రిగుణాత్మకం స్వరూపుడు , త్రైమూర్త్య భావనతో విరాజిల్లుతున్న వినాయకుడు వైదిక కాలం నుండి భారతా వనిలో ఆది దైవ స్వరూపంగా ఉపాసించ బడుతున్నాడు . ప్రకృతిలో రజస్తమో గుణాది స్వరూపు డైన విఘ్నేశ్వరుని ' గుణేశుడు ' అని అభివర్ణించారు. కాలక్రమేణ గణేశుడు అయినాడు . గాణాపత్యం సంప్రదాయానుసారం గణము అనగా సత్య రజస్తమో గుణ సమ్మేళనం. ఈ త్రిగుణాధిపతి విఘ్నేశ్వరుడు పురాణేతిహాసాల బట్టి సకల దేవతా గణాలకు అధిపతి కనుక గణపతి సార్థక నామధేయం కలిగింది. లింగ పురాణం ప్రకారం బలగర్వితులైన రక్కసులు, స్వర్గ లోకాన్ని ఆక్రమించి, దేవతలను అష్ట కష్టా లకు గురి చేయగా వారు పరమ శివుని ప్రార్థించగా, ఆయన రాక్షస సంహారానికి గణపతిని సృష్టించి, రాక్షసులను సంహరించ మనగా , అందులో తన ప్రమేయం లేదని, ఆగ్రహించిన పార్వతి, పరమేశ్వరునిపై కోపాన్ని గణపతిపై ప్రదర్శించి, ఏనుగు తలతో , బాన కడుపు తో , వికార రూపుడై ఉండునటు శ పించగా, చింతా క్రాంతుడైన గణేశుని, శివు దూరడించి, సకల దేవత గణాధిపతిగా, సకల విఘ్న నివారణ దైవంగా అనుగ్రహించాడు. మరో కథనం ప్రకారం గజాసురుని సంహరించి, పరమేశ్వరుని అనుగ్రహం తో పార్వతి చేత పిండి బొమ్మగా చేయబడి, ప్రాణాలు కోల్పోయిన గణపతి, గణాసురుని తలతో పునరుజ్జీవితు డైనట్లు ప్రచారంలో ఉంది. పార్వతీ పరమేశ్వరులు విహరిస్తూ కొలనులో ఉండగా, గజదంపతుల శృంగారాన్ని చూచి మైమరచి, తామూ అదే రూపాలతో క్రీడించగా గజముఖుడైన గణపతి ఆవిర్భవించినట్లు ఐతిహ్యం. గణపతి, పరమేశ్వరునికి తనయుడే కాకుండా విష్ణు రూపుడు కూడా. " శుక్లాం బరధరం విష్ణుం, శశివర్ణం" అన్న ప్రస్తుతి నిరంతరం పఠితమే. పృధ్వీతత్వం ప్రధానంగా కలవారు పరమేశ్వరుని, జలతత్వం కలవాడు గణపతిని, తేజస్తత్వం కలవారు దుర్గా మాతను, వాయుతత్వం కలవారు సూర్యుని, ఆకాశ తత్వం కలవారు విష్ణువు ను ప్రార్థిస్తు ఉండగా , కేవలం ఒక దేవతా మూర్తి కి ఏ శుభకార్యంలో నైనా, తొలి పూజ గావించడం పాంచభౌతిక శరీరధారు లైన మానవులు ఆచరించే సంప్రదాయం, ప్రత్యేకం. సకల దేవతా మూర్తి యైన గణేశుని శుభకార్యాలో తొలి పూజార్హుని చేయడం సనాతన ఆచారం. భాద్రపద శుక్లపక్ష చవితి నాడు గజాసుర సంహారం చేసినందున ఆనాటి నుండే గజానన పూజ ప్రారంభ మైనట్లు కథనం. భాద్రపద శుద్ధ చవితినాడు గణా అధిపతియైన విఘ్నేశ్వరునికి యథా విధిగా ఏకవింశతి పత్రాలతో అర్చించి, తరించడం భారతా వనిలో తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతికి ప్రతీక. వినాయక చవితి జాతీయ సమైక్య పర్వదినంగా లో కమాన్య తిలక్ లాంటి నాయకులు నిర్వహించారు. భారత దేశంలోనే కాక , విదేశాలలోనూ వినాయకుని ఆరాధన ఉంది. 13 వ శతాబ్ది నాటి గణపతి విగ్రహం కిరీటా లంకృతునిగా జావాలో లభించింది. సంయాములో లభించిన విఘ్నేశ్వరుడు కూర్మ వాహనుడు. ఒక చేతిలో చింతామణిని ధరించి ఉండడం ఈ విగ్రహ ప్రత్యేకత. ఈ బొమ్మ ఉన్న వ్రాతప్రతి హనో యు లభించింది. జపాన్ సుమో యోధులు కుస్తీ ఫోజులో ఉన్న గణపతి ద్వయ విగ్రహం లభించింది. క్రీ.శ, 14వ శతాబ్దికి చెందిన గణపతి



విగ్రహం కంబోడియాలో లభించగా, విద్యా ప్రదాతగా కొలిచే ఈ గణపతి చేతులలో పుస్తకం, గంటంగా ఉపయోగించే దంతం ఉన్నాయి. చైనా , జపాన్ లో లభ్యం కాబడిన గణేశ గ్రహాలు ఒక చేతిలో గొడలి, మరో చేతిలో కేరెట్ పటుకుని ఉండగా , వీటిని గర్భధాతు గణపతు లంటారు. శక్తితో కూడిన హేరంబ గణపతి విగ్రహం టిబెట్ లో లభ్యమైంది. హేరంబ గణపతి పంచభూతాల తత్వాన్ని సూచించే రూపంలో సింహాసనాసీనుడైన, నృసింహ గణపతి తత్వాల మేళవింపుగా అనాది కాలం నుండి పూజార్హమై ఉంది. ధన్వంతరిగా లంబోదరుడు ఉదర సంబంధ వ్యాధులను నయం చేసే దేవతగా కొలువ బడుతున్నాడు. అష్ట వినాయకులుగా ప్రసిద్ధి పొందిన దేవతా రూపాలు మహారాష్ట్రలో నెలకొని ఉన్నాయి. వికటరాజ రూపంలో మోరేగావ్లో మయూరేశ్వరునిగా, పాలి గణపతి రూపంలో భల్లారే శ్వర్ లో లంబో దరునిగా , మాత్ లో వరద వినాయకునిగా, మహొదర రూపంలో ఓజార్ లో, విఘ్నేశ్వరుని గా విఘ్నరాజ రూపంలో లెన్యాద్రిలో , గిరిజాత్మజ రూపంలో ధూమ్రవర్ణునిగా, తేవూర్లో చింతా మణి రూపంలో వక్ర దంతునిగా , సిద్దిటేక్ లో సిద్ధి వినాయక రూపంలో సిద్దేశ్వర స్వామిగా , రంజన్ గావ్లో మహా గణపతి రూపంలో గజాననునికి మహారాష్ట్ర గణపతి ఆరాధన భూమిగా నిలచి ఉంది.

# గణనాధుడి ఆగమనానికి సర్వం సిద్ధం





**చవితి ఏర్పాట్లతో మండలంలో సందడి వాతావరణం**

**తొలి పూజతో మొదలు కానున్న నవరాత్రి ఉత్సవాలు**

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మండలంలో వినాయకచవితి సందడి మొదలైంది. మంగళవారం వాడవాడలా, వీధివీధిన విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు యువకులు పోటీపడుతూ విగ్రహాలను తీసుకువస్తున్నారు. చవితి రోజుకు అవసరమైన పండ్లు, గణపతి విగ్రహాలు, పత్రులు, పువ్వుల నిమిత్తం విద్యార్థులు,మహిళలు తరలి వస్తుండడంతో దుకాణాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. పలు గ్రామాల్లోని వీధుల్లో వినాయక మండపాల ఏర్పాట్లలో యువత నిమగ్నమయ్యారు. బుధవారం జరిగే వినాయక చవితి వేడుకకు ప్రజలు సన్నద్ధమయ్యారు. తొలిపూజ తో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. మండలంలో తొమ్మిది రోజులపాటు కన్నులపండువగా గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు భక్త,ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేందుకు సోమవారం నుంచి ప్రయత్నాలు మొదలు పెట్టడంతో వాడవాడలా పండుగ సందడి నెలకొంది. కాగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు తీవ్రంగా కసరత్తులు ప్రారంభించారు.

## తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను కొనసాగించాలి



రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అఖిలభారత దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు పలివెల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం రామచంద్రపురంలో దివ్యాంగుల సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ కార్యదర్శి ముత్యాల పోసి కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుల వైఖల్య శాతం తగ్గించడం దారుణం అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దివ్యాంగులపై నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రద్దు చేసిన దివ్యాంగుల పింఛన్లను కొనసాగించాలని పుట్టకతో వైకల్యం బాధపడుతున్న దివ్యాంగుల వైకల్య శాతాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ ఈనెల 28వ తేదీన రామచంద్రపురం ఆర్డీవో ఆఫీస్ వద్ద దివ్యాంగులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు 99124950 88,9866188321,98 49640432 నంబర్లకు ఫోన్ నెంబర్ లను సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో పి.హెచ్.సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మేడిది మృతి



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్** అంబాజీపేట పి. హెచ్. సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మేడిది రంగ జానకీ ప్రసాద్(చిన్న) (55) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం చిన్నా మృతదేహం అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి ప్రధాన పంటకాలవలో తేలియాడుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం చిన్న స్థానిక కొర్లపాటి వారి పాలెం లో నివాసముంటున్నారు. తండ్రి కాలం నుండి కొబ్బరి వ్యాపారం,టిడిపి లో క్రియాశీలక సభ్యుడి గా,స్థానికంగా ఉన్న వెంకటేస్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీలో సభ్యుడిగా ఎన్నో సేవలు అందించి,వివాద రహితుడుగా అందరి మన్ననలు పొందాడు. ముఖ్యంగా పి. హెచ్.సి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా పనిచేసిన సమయంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షా యోజన కార్యక్రమాన్ని ఎంతో ఉన్నతంగా నిర్వహించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఎంతో పేరు గాంచారు. కాగా మృతుడు చిన్నాకు భార్య పావనీ రాణి,కుమారుడు,కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రస్తుతం అమెరికాలో ఎం.ఎస్ చదువుతున్నాడు. చిన్నా మరణ వార్తతో కొర్లపాటి వారి పాలెం శోక సముద్రంలో మునిగి పోయింది.

## వినాయకుని మట్టి విగ్రహాల పంపిణీ చేసిన డిఎస్పీ, సీఐ, ఎస్ఐ.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం పోలీస్ స్టేషన్ ఫరిదీలో అల్లవరం వాస్తవ్యులు, టీడీపీ నాయకులు బండిగుప్తాపు పాండురంగ ఆధ్వర్యంలో డి. ఎస్పీ, ప్రసాద్, సి,ఐ. డి. ప్రశాంత్ కుమార్, ఎస్.ఐ సంపత్ కుమార్ చేతులు మీదగా మంగళవారం వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు వీరబాబు , బి జె పి నాయకులు రాయుడు, పలువురు టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శం

**రాయవరంలో ఘనంగా మదర్ థెరిస్సా 115వ జయంతి వేడుకలు**

**మదర్ థెరిస్సా యూత్ వారి సేవలు అభినందనీయం**

**వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మదర్ థెరిస్సా ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని జిల్లా వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం లో దళిత కాలనీలో మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన, మదర్ థెరిస్సా 115వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కుష్టువ్యాధి బాధితులకు ఆమె అందించిన సేవలు మరువలేనివని, తన సేవలతో గుర్తింపు పొందిన ఆమె అందరికీ అమ్మగా మారారని, ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సా సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆమె చూపిన మార్గంలోనే నడుస్తూ, పలువురిని ఆదరిస్తూ,వారికి సహాయపడుతున్న స్థానిక మదర్ థెరిస్సా యూత్ వారిని ఆయన అభినందించారు. కరోనా కష్ట కాలంలో భయపడి ఇంట్లోనే ఆగిపోకుండా, రోడ్డు ప్రక్కల ఉండే అభాగ్యులకు ప్రతీ రోజు అన్నదానం చేసి ఆకలి తీర్చారని గుర్తుచేస్తూ యూత్ సభ్యులను కొనియాడారు. తదుపరి కేట్ కటింగ్ చేసి స్థానిక పాఠశాలలోని చిన్నారులకు తినిపించి,వారికి చాక్లెట్స్ అందించారు. మదర్ థెరిస్సా జయంతి వేడుకలను పురస్కరించుకుని యూత్ సభ్యులు స్థానికులకు స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ చంద్రమల్ల సంజయ్ రాజు, వైస్ ప్రెసిడెంట్ దువ్వ చంద్రశేఖర్, సెక్రటరీ కందుకూరి గంగరాజు, జాయింట్ సెక్రటరీ పలివెల సురేష్, ట్రెజరర్ చంద్రమల్ల రాజు, యూత్ సభ్యులు సుధాకర్, వీరబాబు, బాలు, అనిల్, స్థానిక వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తి మాతృమూర్తి మదర్ థెరిస్సా

**రాయవరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బ్రెడ్లు, పళ్ళు పంపిణీ**

**“స్నేహ స్వచ్ఛంద సేవ” ఆధ్వర్యంలో కార్యక్రమం**



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** సాటి వారికి సేవ చేయడమే భగవంతుని సేవించడం అనే నినాదంతో సమాజ సేవకు జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత సేవా మూర్తి మదర్ థెరిస్సా అని, ఆమె జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదయకమని స్నేహ స్వచ్ఛంద సేవ అధ్యక్షురాలు డి ఆదిలక్ష్మి అన్నారు. మదర్ దెరిసా 115 వ జన్మదినం పురస్కరించుకొని మండల కేంద్రమైన రాయవరంలో గల అనాధ వృద్ధాశ్రమంలో సుమారు 40 మంది వృద్ధులకు స్నేహ స్వచ్ఛంద సేవ సభ్యులతో కలిసి బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నేహ స్వచ్ఛంద సేవ సభ్యులు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేసిన విశ్వమాత, మదర్ థెరిస్సా అని, తన సేవలు ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన మహోన్నతమైన వ్యక్తి గా వెలుగొందారని, పేదల కోసం తోటి వారికి సహాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన మాతృమూర్తి మదర్ థెరిస్సా అని కొనియాడారు. ఆమె చూపిన మార్గం అనుసరణీయమన్నారు. మదర్ థెరిస్సా ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని, పలు దేశాల మధ్య యుద్ధాల సమయంలో ఆమె చూపిన తెగువ వెలకట్టలేనిదని వివరించారు. ఈ కార్యక్రమంలో స్నేహ స్వచ్ఛంద టీం సభ్యులు ఎస్. కృష్ణకుమారి, డి. ఆదిలక్ష్మి, సిహెచ్. సత్యవేణి, ఎమ్. వెంకటలక్ష్మి, కె. నాగ విజయలక్ష్మి, పి. సుబ్బరాజు, లచ్చిరెడ్డి వెంకటరమణ, నాగిరెడ్డి, ఎస్ దుర్గాప్రసాద్, ఎస్ తులసి తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ సీడ్స్ పౌండేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించచన మదర్ తెరిస్సా జయంతి వేడుకలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** సేవకు మారుపేరు ప్రేమకు ప్రతిరూపంగా ప్రపంచాన్ని దయ కరుణతో నింపిన మదర్ థెరిస్సా ఆదర్శనీయమూర్తి అని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా చిత్రపటానికి రమణారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తన దేశం కాని భారతదేశంలో ఎంతోమంది అనాధలను అభాగ్యులను కుష్టు రోగులను తన సొంత కుటుంబీకులుగా భావించి అక్కున చేర్చుకుని సేవలందించిన మదర్ థెరిస్సా చరిత్రలో చిరస్మరణీయులుగా మిగిలిపోతారని రమణారావు కొనియాడారు. కార్యక్రమంలో భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్, ఉప్పలగుప్తం వైసిపి ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, పరమట రాజశేఖర్,పందిరి సుబ్బరాజు, నక్క సంపత్ కుమార్,నేరేడుమిల్లి శ్రీనివాసరావు,గంటా లక్ష్మీప్రసాద్, నేలపూడి సుగంధ కుమార్,కుంచే అర్జున్,పరమట రాజేష్ , విప్పర్తి రమేష్,గణేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# భాష్యం స్కూల్‌లో వినాయక చవితి వేడుకలు





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం భాష్యం స్కూల్ నందు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జోనల్ ఇంచార్జ్ జవ్వాది వెంకట శ్రీనివాస్ మట్టి గణపతుల తయారీపై అవగాహన సదస్సు నిర్వహించి వినాయక చవితి సమయంలో గణపతి ప్రతిమల తయారీకి రసాయనాలతో కూడిన రంగులు వాడుతున్నారని వీటి వలన గాలి, నేల, నీరు కలుషితమవుతున్నాయని తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని తెలిపారు. మట్టి గణపతుల వినియోగం ద్వారా ప్రకృతి మాతకు ఎటువంటి నష్టము జరగదని విద్యార్థులకు వివరించారు. తరగతుల విరామ సమయంలో విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారుచేసి దీని ఆవశ్యకతను అందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి హెచ్ రవి,చాంప్స్ ఇంచార్జీ నాగశ్రీ, జె రాజేశ్వరి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పట్ల భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ హర్షం వ్యక్తం చేశారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సుధా గణపతి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సుధా గణపతి ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ క్లబ్ హాలు వద్ద వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సుధా గణపతి మాట్లాడుతూ మట్టి గణపతి ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ అనిల్ కుమార్ జైన్, పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ పి ఎస్ శర్మ,పూర్వపు అధ్యక్షుడు లయన్ రవణం వేణుగోపాలరావు, కోశాధికారి లయన్ గుత్తుల నాగేశ్వరరావు, బిల్డింగ్ కమిటీ చైర్ పర్సన్ లయన్ సుగ్గు గోపి, లయన్ పట్నాల రమణ, లయన్ వరద రాంబాబు,లయన్ తాతయ్య కాపు మరియు ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## 31న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా



**రామచంద్రపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వారం వారం నిర్వహించే జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 31 న ఉదయం 10 గంటలకు రామచంద్రపురంలోని ఉపాధి భవన్లో జాబ్ మేళా జరుగుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్ మేళాలో మదర్ సొన్,ముతూట్ ఫైనాన్స్, గూగుల్ పే కంపెనీలు హాజరుకానున్నారు. మదర్ సొన్ కంపెనీ లో టెన్త్,ఇంటర్,డిగ్రీ,బిటెక్, డిప్లొమా,ఐటీఐ చదివిన సంవత్సరాలు లోపు అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. రామచంద్రపురం కేవీర్ హాస్పిటల్ వెనుక గల ఉపాధి భవన్ నందు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి అని తెలియజేసారు.


## నల్లా చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** మంగళవారం నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెండి, బంగారు వర్తక సంఘం షరాబులు వినాయక పందిరి లో నల్లా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నల్లా పవన్ కుమార్ మరియు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోనం సత్తిబాబు, వాకర్స్ క్లబ్ ఏవీపీ గోకరకొండ నాగేంద్ర చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు, రంగులతో తయారుచేసిన వినాయక విగ్రహాలను కాలువల నీటిలో కలపడం వలన నీరు కలుషితం అవుతుందని అందువలన మట్టి వినాయకుడిని పూజించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అరిగెల నాని, మేడిచర్ల త్రిమూర్తులు, వలవల శివరావు, నూకల సత్యనారాయణ, పేరి లక్ష్మీ నరసింహం, నాగ నవీన్, పెదమళ్ళు మణికంఠ, నల్లా దుర్గారావు, గోకరకొండ గంగన్న స్వామి, పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు...

**మాజీ ఎంపీ చింతా అనురాధ.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆది దంపతుల ప్రథమ కుమారుడ్కైన ఆ గణనాథుణ్ని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, ఆయన కృపతో సమస్త విఘ్నాలు తొలగి, తలపెట్టే కార్యాలన్ని విజయవంతం కావాలని, ఆ గణపతి అనుగ్రహంతో ప్రజలందరికీ సదా, సర్వదా అభయ, లాభ, శుభాలు ప్రజలందరికీ చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చింతా అనురాధ తెలిపారు.

## చంద్రబాబు 14 ఏళ్ల సీఎం హెూదాలో 13 డిఎస్సీలు నిర్వహణ....

......1లక్షా 80వేల 208 పోస్టుల భర్తీతో చరిత్ర....

......టీడీపీ కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల వెల్లడి...



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** మెగా డీఎస్సీతో కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలిచిందని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా తెలుగు దేశం పార్టి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం 16,347ఉపాధ్యాయ పోస్టులతో మెగా డివస్సీ నిర్వహించామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ప్రతిసారీ టీచర్ పోస్టుల భర్తీకి క్రమం తప్పకుండా డివస్సీ నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా గత పాలనలో చేపట్టిన నియామకాల గణాంకాలను వెల్లడించారు. డీఎస్సీ నిర్వహించకుండా వైసీపీ 24 కేసులు వేయించినా, వాటిని అధిగమించి నిర్వహించిన ఘనత మంత్రి లోకేష్కు దక్కుతుందన్నారు. చంద్రబాబు హయాంలో దాదాపు 1,80, 208 టీచర్ పోస్టులను భర్తీ చేసామన్నారు. ప్రభుత్వం ఎల్లవేళలా నిరుద్యోగులకు అండగా ఉంటుందని నవీన్ మరోసారి చెప్పారు. డీఎస్సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యంగ అభ్యర్ధులకు వయసు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డమే కాకుండా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాలతో పాటు స్టూడెంట్ టీచర్ నిష్పత్తికి సరిపడా ఉపాధ్యాయులు ఉంటేనే విద్యారంగ ముఖచిత్రం మార్చగలిగేదని నమ్మిన మంత్రి లోకేష్ విద్యార్థుల కల నిజం చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉండి ఇప్పటివరకు 13 డిఎస్సీలు నిర్వహించి 1లక్షా 80 వేల 208 పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా కూటంమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చి సులభతరం చేసిందన్నారు. చంద్రబాబు మెగా డీఎస్సీ నిర్వహిస్తే సైకో జగన్ దగా డీఎస్సీ నిర్వహించారని నవీన్ విమర్శించారు.

## కాకినాడలో ఆయుర్వేద కళాశాల ఏర్పాటుకు చర్యలు....

.....రూ.16.40కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

.....ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి



**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** జిల్లా కేంద్రం కాకినాడలో ఆయు ర్వేద కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యు లు తంగెళ్ల ఉదయ్ శ్రీనివా స్ వెల్లడించారు. మంగళ వారం ఆయన మాట్లాడుతూ కాకినాడలో మహిళా పాలిట క్నిక్ కళాశాల ఆవరణలో నిర్మించిన 50 పడకల ఆయుష్ ఆసుపత్రికి కొనసాగింపుగా ఆయుర్వేద కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ఏడాది నవంబర్ లో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ కు లేఖ రాయగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపిస్తే 'నేషనల్ ఆయుష్ మిషన్' పథకం కింద నిధులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ ను వ్యక్తిగతంగా కలిసి కాకినాడ లో ఆయుర్వేద కళాశాల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించి ఇటీవల కేంద్రానికి రూ.16.40 కోట్ల అంచనా వ్యయంతో కళాశాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిం చడం జరిగిందన్నారు. త్వరలో కేంద్రమంత్రి ప్రతాప్ రావు జాదవ్ ను వ్యక్తిగతంగా కలిసి నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తా నని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. త్వరితగతిన స్పందించి కేం ద్రానికి ప్రతిపాదనలు పంపిన మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ .....



**కాకినాడసిటీ :విశ్వం వాయిస్ న్యూస్** జిల్లాలో త్వరలో జరగబోయే వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా, కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.వినాయక శోభయాత్ర, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల పరిశీలనను జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి నిర్వహించారు.వినాయక విగ్రహాల ఊరేగింపులు క్రమబద్ధంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు, పట్టణ ప్రజలకు అసౌకర్యం లేకుండా ట్రాఫిక్ నిర్వహణ చేయాలన్నారు.నిమజ్జనానికి ఉపయోగించే చెరువులు, కుంటలు, భారీ క్రేన్లు, స్విమ్మర్లు, డ్రెస్సులు, బోట్లు తదితర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.వెనుకాటుకు తావు లేకుండా, అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిమజ్జనం పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండి, పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఎస్బి డీఎస్పీ కే.వి. సత్యనారాయణ సర్కిల్ ఇన్స్పెక్టర్లు ఎమ్. నాగ దుర్గారావు, పి. సునీల్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు ఎన్. రమేష్, ట్రాఫిక్ – 1, డి. రామారావు, ట్రాఫిక్ – 2, టి.రామ్మోహన్ రెడ్డి, మెరైన్ ,సబ్ ఇన్స్పెక్టర్లు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### హెల్మెట్, ట్రాఫిక్, సైబర్, నేరాలపై వాహనదారులకు

# అవగాహన ట్రాఫిక్ సీఐ రమేష్

**కాకినాడసిటీ:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ – సినిమా రోడ్" నందు వాహన దారులకు మరియు పాదాచారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన కాకినాడ ట్రాఫిక్ పోలీసులు మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్/ ధరించాలని మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని రాష్ అండ్ నెగ్లిజెన్స్ గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయెుద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా అందరు పాటించాలని మోటార్ వెహికల్ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలియజేసి సైబర్ నేరలలో భాగముగా

1) ఆన్లైన్ మోసాలు,
2) ఫేక్ లోన్స్ మోసాలు,
3) ఆన్లైన్ జాబ్స్/వర్క్స
4) డిజిటల్ అరెస్టు
5) 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి



వివరించినారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ట్రాఫిక్ ఎస్ ఐ సిహెచ్ కిషోర్ కుమార్ మరియు 3 టౌన్ లా అండ్ ఆర్డర్ సిబ్బంది మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్రాభివృద్ధికి కేంద్ర తోడ్పాటు

ఏడాదిన్నరలో రాష్ట్రానికి 10 లక్షల కోట్ల పెట్టుబడులు...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్...

**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** రాష్ట్రాభివృద్ధికి కేంద్రప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా కాకినాడ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. చాయ్ పే చర్చ, మల్లాడి సత్యలింగ నాయకర్ విగ్రహంకి నివాళులు, టూటౌన్ సెంటరు నుండి కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ, అనంతరం సూర్య కళా మందిరంలో నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ తన పర్యటనలో భాగంగా అనేక వర్గాలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినాయక పందిళ్లకు ఉచిత విద్యుత్ ఆహ్వానించదగ్గ పరిణామమ న్నారు. రాబోయే దుర్గా నవరాత్రులకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కాకినాడ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అభివృద్ధికి వివిధ శాఖల ద్వారా పెద్ద ఎత్తున నిధులు సమకూరుస్తున్నారన్నారు.కోతకు గురవుతున్న ఉప్పాడ సముద్ర తీరంలో జియో టాగ్ లైన్ నిర్మాణానికి కృషి జరుగుతోందని, మడ అడవులు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్రం ద్వారా అనేక పరిశ్రమలు రాష్ట్రానికి రాబోతున్నాయన్నారు. ఏడాదిన్నర కూటమి ప్రభుత్వ కాలంలో పది లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చాక సోలార్ కరెంటు ఉత్పత్తిపై చర్యలు చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం




సూర్య గృహ్హా పేరుతో కేంద్ర పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇండియా కూటమి రోజుకో అబద్ధం ప్రచారం చేస్తోందని విమర్శించారు. కూటమి పాలన బాగుందన్నారు. కూటమి భాగస్వాములతో కలిసి ముందుకు వెడతామన్నారు. వైసీపీ హయాంలో కాకినాడ స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగమయ్యాయన్నారు. కాకినాడ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు ఏర్పాటు, విద్యుత్ తీగలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కోటిపల్లి రైల్వే లైన్కు తన వాటా నిధులు ఇవ్వని కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మాధవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, మీడియా ఇంచార్జ్ యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా కృష్ణ మోహన్, జిల్లాలోని నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ హామీనిని నిలుపుకున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం

– ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకుల సుధీర్ఘ కాల స్వప్నమైన మెగా డీఎస్సీ ప్రకటనను వెలువరించి ఉద్యోగం నియామకాలను చేపడతామని 2024 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్.డి.ఏ. కూటమి పార్టీలు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించింది. నియామక ప్రక్రియ పత్రాల తయారీ చివరి దశకు చేరుకుందని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు విషయంలో అర్హత కల్పించేందుకు మినహాయింపులను ప్రభుత్వం కల్పిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక పత్రికా ప్రకటనను వెలువరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని సరైన మార్గంలో నడిపిస్తోంది. విద్యా రంగ అభివృద్ధిలో మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతులు, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేస్తూ విద్యా వ్యవస్థను ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. విద్యారంగ అభివృద్ధిపై తెలుగు దేశం పార్టీకి ప్రత్యేక దూరదృష్టి ఉంది. గతంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడు తన పాలనలో 13 డీఎస్సీ నిర్వహించి 1,80,208 మంది ఉపాధ్యాయ నియామకాలను చేపట్టారు. నేడు రాష్ట్రంలో విధులను నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల్లో ఎక్కువ శాతం మంది చంద్రబాబు పాలనలో ఉద్యోగాలు పొందిన వారేనని సత్యప్రభ గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే దిశలో ముందుకు సాగుతుందని, విద్యా రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆమె కోరారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఘోరంగా మోసం చేసింది. యువత ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఐదేళ్ల పాటు వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. 'మనబడి నాడు – నేడు' పథకంలో వేల కోట్ల రూపాయలను దోచుకోవడమే వారి పాలన ప్రత్యేకతగా నిలిచిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆరోపించారు.

## రేషన్ పంపిణీలో పారదర్శకతకు స్మార్ట్ కార్డు విధానం ప్రారంభం

వెదురుపాకలో రేషన్ స్మార్ట్ కార్డ్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** ప్రభుత్వం రేషన్ పంపిణీ మరింత పారదర్శంగా జవాబుదారీతనంగా నిర్వహించాలని లక్ష్యంతో పాత కార్డులు స్థానంలో రాజముద్రతో ఏటీఎం కార్డు సైజులో ముద్రించి క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మండలం వెదురుపాక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి సింగరమ్మ అధ్యక్షతన కొత్త రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ రేషన్ సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ స్మార్ట్ కార్డు సిస్టం ఏర్పాటు చేసిందని ప్రతి ఒక్కరూ రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీటిని బ్లాక్ మార్కెట్లో అమ్మకూడదని అన్నారు. ఒక కేజీ బియ్యం40 రూపాయల ఖర్చుతో మీకు ఉచితంగా పంపిణీ చేస్తుందని మీరు వాటిని మళ్ళీ అమ్మితే మిల్లర్స్ వాటినే మళ్లీ రీసైక్లింగ్ చేసి మీకు 60 రూపాయలకు అమ్ముతున్నారని దీనివల్ల మీకు, ప్రభుత్వానికి ఎంతో నష్టం వాటిలితుందని రేషన్ అక్రమ దందాను ప్రతి ఒక్కరు అరికట్టాలని ఎమ్మెల్యే నెహ్రూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు పిల్ల చంటిబాబు, సూరంపాలెం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, టిడిపి నాయకులు దాసరి తమన్న దొర, మంగ రౌతు రామకృష్ణ, ఎస్ బాబు, గునిపే భరత్, బదిరెడ్డి అచ్చన్న దొర, మలిరెడ్డి సిరి, గల్లా రాము, బొట్టా రామకృష్ణ, నలమహారాజు, గోపీనాథ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి దుర్గాప్రసాద్, గోకవరం ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎమ్మెస్ ఓ, రేషన్ డీలర్లు అధిక సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## భర్తపై పెట్రోల్ పోసి నిప్పు అంటించినభార్య

**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** భర్త పై పెట్రోలు పోసి అంటించిన భార్యపై కేసు నమోదు. రావులపాలెం టౌన్ సిఐ గారి తెలిపిన వివరాలు ప్రకారం రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన మట్ట ఏంజలీనా జెన్నీఫర్ థామస్ తన భర్త మట్టా శ్రీనివాస్ ప్రతిరోజు తాగి వచ్చి వేధించడంతో వేధింపులు తాలలేక ది 25 8 2025 తేదీ రాత్రి సుమారు మూడు గంటల సమయంలో నిద్ర పోవుచున్న శ్రీనివాస్ (40) పై. అప్పటికే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను పోసి నిప్పు పెట్టగా భర్త అయిన మట్టా శ్రీను కు తీవ్ర గాయాలయి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఈ విషయమై రావులపాలెం ఎస్సై కెవి రమణ రెడ్డి గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నట్లు తెలియపరిచినారు

## మట్టి వినాయక విగ్రహాలను వినియోగించండి

## కాజులూరు విద్యార్థుల ర్యాలీ




**విశ్వం వాయిస్ కాజులూరు** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పిలుపు మేరకు కాజులూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి, స్కౌట్ టీచర్ జి.బుజ్జిబాబు ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీగా తిరిగి ఈ వినాయక చవితిని పర్యావరణ హాని జరగకుండా నిర్వహించాలని కోరారు. ప్లాస్టరాఫ్ పారిస్ తో తయారు చేసే రంగుల విగ్రహాలతో కాకుండా సాంప్రదాయ రంగులతో తయారు చేసిన లేదా రంగు లేని మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని గ్రామస్తులకు అవగా హన కలిగించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ కూడలి వద్ద విద్యార్థులంతా మానవహారాన్ని ఏర్పరచి గ్రామస్తుల ను చైతన్య పరిచారు. ఈ ర్యాలీలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ కె హరినాథ్, కె. భాస్కర్ సత్య ప్రసాద్, షేక్ వలీ భాషా, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుకు వాటర్ టిన్నులు అందజేసిన రవికుమార్



**విశ్వం వాయిస్- కాజులూరు** కాజులూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక గ్రామానికి చెందిన జనసేన నాయకులు యాళ్ళ రవికుమార్ సుమారు 10వేల రూపాయలు పైగా విలువ కలిగిన 16 కూలింగ్ వాటర్ టిన్ లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి సమక్షంలో వాటిని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు సేవలందించడంలో రవికుమార్ ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. రవికుమార్ స్ఫూర్తితో గ్రామ పెద్దలు, గ్రామం లో గల యువత పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు మాట్లాడుతూ రవికుమార్ గారు విద్యార్థుల దాహాన్ని తీర్చడానికి తన వంతు సహాయం చేయడం శు భపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, స్టాఫ్ సెక్రటరీ కె హరినాథ్, షేక్ వలీ భాషా, బుజ్జిబాబు, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతిని పూజిందాం... జల కాలుష్యాన్ని నివారిద్దాం...



**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** పర్యావరణ పరిరక్షణకు జల కాలుష్య నివారణకు ధరిత్రి రక్షి త సమితి చేస్తున్న కృషి అబినందనీయం అని జాయింట్ కలెక్టర్ రాహూల్ మీనా పేర్కొన్నారు. కాకినాడ భానుగుడి సెంటర్లో ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ధరిత్రి రక్షిత సమితి ప్రెసిడెంట్ సిమకుర్తి సురేఖ అధ్యక్షత వహించగా జాయింట్ కలెక్టర్ రాహూల్ మీనా ముఖ్యఅతిథిగా పాల్గొని మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్య క్రమాన్ని ప్రారంచించారు. కాకినాడ పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి మట్టి గణపతి విగ్రహాలను తీసుకువెళ్ళారు. ఈసందర్భంగా జె.సి. రాహూల్ మీనా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలన్నారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ కొమిరిశెట్టి నరసింగరావు, ట్రెజరర్ సిమకుర్తి మురళీకృష్ణ, సభ్యులు కృష్ణకుమా ర్, మణికంఠ, డా.అలపాటి శ్రీనివాస్, డా.నాగేంద్రకుమార్, మృత్యుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
బుధవారం 27 ఆగస్టు 2025
www.viswamvoice.com



# 29న థియేటర్లలో కబడ్డితో సందడి చేయనున్న'అర్జున్ చక్రవర్తి'

కబడ్డీ ఆటలో రాణించడానికి హీరో పడిన శ్రమే ఈ సినిమా
అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది
హీరో విజయరామరాజు
ప్రమోషన్ లో భాగంగా యూనిట్ రాజమండ్రిలో సందడి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ఎంతో కష్టపడి చేసిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఈనెల 29న విడుదల కాబోతోందని హీరో విజయరామరాజు చెప్పారు. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే వచ్చిన స్పందన చూస్తుంటే ఇది అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో రూపొందిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా ప్రమోషన్ లో భాగంగా చిత్ర యూనిట్ సోమవారం రాజమండ్రి విచ్చేసింది. ఈసందర్భంగా హోటల్ లా హాస్పిన్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో విజయ రామరాజు మాట్లాడుతూ లోకం గుర్తించిన గొప్ప కబడ్డీ ఛాంపియన్ కథే 'అర్చున్ చక్రవర్తి' అని అన్నారు. అజయ్ ఘోష్ వంటివాళ్ళు కూడా ఈ సినిమాలో ముఖ్యపాత్రలు పోషించారని అన్నారు. పీరియాడికల్‌గా జరిగే కథకు అనుగుణంగా శరీరాకృతిలో వచ్చే మార్పుల కోసం చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారని తెలిపారు. టీజర్,పాటలు, ట్రైలం లకు ఇప్పటికే ప్రేక్షకుల నుండి మంచి స్పందన వచ్చిందన్నారు. 1950 నుండి 1990 వరకు ఈ చిత్రకథ ట్రావెల్ అవుతుందన్నారు. అర్జున్ చక్రవర్తి అనే కబడ్డీ ఛాంపియన్ బయోపిక్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు విక్రాంత్ రుద్ర తెరకెక్కించారన్నారు. వాస్తవికతకు దగ్గరగా కథను చూపించడానికి దర్శకుడు చాలా శ్రమించారన్నారు. మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రతల్లో మంచు కొండల్లో పనిచేయడం జరిగిందన్నారు. ఈనెల 29న విడుదల అవుతున్న తమ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కబడ్డీ క్రీడతో పాటు అందమైన ప్రేమకథ ఉందని తెలిపారు. సినిమాలో రమణ కేరక్టర్ చేసిన ఆర్టిస్ట్ దుర్గేష్ మాట్లాడుతూ కబడ్డీ ఆటగాడు కేరక్టర్ లో విజయ రామరాజు ఎంతగా శ్రమించాడో చెప్పలేనిదని , అతడికి అనుక్షణం సపోర్ట్ చేసే కేరక్టర్ తనదని చెప్పారు. అర్జున్ చక్రవర్తి కేరక్టర్ కి వెయ్యి శాతం న్యాయం చేశాడన్నారు. దెబ్బలు తగిలినా, బ్లడ్ వచ్చినా సరే పట్టుదలతో తన కేరక్టర్ ని పండించాడని అన్నారు. కబడ్డీ ఆటగాళ్లను తీసుకొచ్చి, ఏడాది శిక్షణ పొంది మరీ ఈ కేరక్టర్ చేసాడని అన్నారు. కోవిడ్ రావడం వలన ఏడాదిన్నర సమయం పోయిందని, మొత్తం 4న్నర సంవత్సరాలు షూటింగ్ కి వెచ్చించాల్సి వచ్చిందని దుర్గేష్ అన్నారు. కొత్త డైరెక్టర్ ని నమ్మి నిర్మాత చాలా ఖర్చుచేసి, విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. డైరెక్టర్ చాల క్లారిటీగా నటన రాబట్టారని తెలిపారు. సినిమా వీక్షించే సమయంలో ఇది కొత్త డైరెక్టర్ చేసిన సినిమాలా ఉండదన్నారు. డీఓపి జగదీశ్ చాలా బాగా చిత్రీకరించారని, పాటలు బాగా వచ్చాయని, టీజర్,ట్రైలర్ కి మంచి స్పందన వచ్చిందని వివరించారు. మన భాష కాకపోయినా సిజా రోజ్ ఈ సినిమాలో దేవిక కేరక్టర్ లో మంచి నటన కనబరిచిందన్నారు. ఈ సినిమాలో వచ్చే సీన్స్ ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో ఒక సమయంలో ఎదుర్కొన్నట్లే ఉంటుందని ఆయన అన్నారు. కథానాయకి సిజా రోజ్ మాట్లాడుతూ ఈ చిత్రంలో దేవిక పాత్రలో నటించానని, గొప్ప క్రీడాకారుని నిజజీవిత కథే అర్జున్ చక్రవర్తి అని తెలిపారు. మంచి ప్రేమ కథ కూడా ఉందన్నారు. కీలక పాత్రలో నటించిన సీనియర్ నటుడు దయ మాట్లాడుతూ క్రీడల్లో జరిగే రాజకీయాలను ఈ చిత్రంలో చూపించడం జరిగిందన్నారు. యువ క్రీడాకారునిగా, యుక్త వయస్కునిగా, కోచ్‌గా పలు షేడ్‌లు ఉన్న పాత్రలో నటించడం జరిగిందన్నారు.

# శ్రామిక భవనం నిర్మాణం సత్వరం పూర్తిచెయ్యాలి

భవనం పూర్తి చేసి కార్మికులకు అంకితం చేయాలి... లేకుంటే ధర్మపోరాటం ద్వారా కార్మిక సత్తా చూపిస్తాం : బొజ్జ రామకృష్ణ హెచ్చరిక
కార్మికులకు ఉచిత న్యాయ సగాయాన్ని వినియోగించుకోవాలి : సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** క్వారీ మార్కెట్ సెంటర్ లోని శ్రామిక భవనం నిర్మాణం సత్వరం పూర్తిచేసి కార్మికులకు అంకితం చేయాలని,భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య అధ్యక్షుడు,గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇప్పటికే కోటి రూపాయలు వ్యయం చేసి పిల్లర్స్ వరకు నిర్మించారని, కూటమి ప్రభుత్వం రూ. 2.5 కోట్లు కేటాయించి శ్రామిక భవనం పూర్తి చేయాలని ఆయన కోరారు. లేకుంటే ధర్మపోరాటం కార్యక్రమం పేరుతో కార్మికుల సత్తా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం భవన నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి శ్రీలక్ష్మి ఆశీస్సులతో శ్రామిక భవనం ఆవరణలో బొజ్జ రామకృష్ణ అధ్యక్షన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి, కార్మిక శాఖ నుంచి సర్కిల్4 శేఖర్, సర్కిల్2 సత్యనారాయణ హాజరయ్యారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొజ్జ రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న శ్రామిక భవనానికి 2023లో శంకుస్థాపన జరిగిందని ఇప్పటికే పిల్లర్లు నిర్మిఃచారని,మిగతా భవనాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. అయితే కార్మికులు రాజమండ్రిలో ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్ళలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొని ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. 2024 ఎన్నికల సమయం లో అధికారంలోకి రాగానే 100 రోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని,వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు,పవన్



కల్యాణ్, నారా లోకేష్ 500 రోజులు అవుతున్నా ఇప్పుడు దీనిపై మాట్లాడడం లేదని ఆయన విచారం వ్యక్తంచేశారు. కార్మికమంత్రి వాసంశెట్టి సుభాష్ కూడా కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం లేదని బొజ్జ రామకృష్ణ విమర్శించారు. కార్మికులకు న్యాయం చేసేందుకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించా లని,ఓబిసి కార్డులు నాలుక గీసుకోడానికి కూడా పనికి రావడం లేదని,కార్మికులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా లేబర్ ఆఫీసులను ముట్టడించే కార్యక్రమం వచ్చే నెలలో చేపడతామని ఆయన హెచ్చరించారు. ముఖ్య అతిథి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సివిల్ జడ్జి శ్రీలక్ష్మి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సహాయం, అవసరమైన సలహాలు ఇచ్చేందుకు తమ సంస్థ పని చేస్తుందని చెప్పారు. కార్మికులు ఉచితంగా న్యాయ పరమైన సేవలు,సలహాలు పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి న్యాయ సేవాధికార సంస్థ తనవంతు



సేవలు అందిస్తోందని సివిల్ జడ్జి శ్రీలక్ష్మి చెప్పారు. జిల్లా విశ్వకర్మ వడ్రంగి పనివారల సంఘం అధ్యక్షుడు దేవగుప్త శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రామిక భవనం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని లేకుంటే ధర్మపోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ శ్రీనివాస్ బుజ్జి మీడియా ప్రతినిధి కాకి రవిబాబు సెక్రెటరీ గోవడకొండ బాబు విశ్వకర్మ వడ్రంగి పని వాళ్ళ సంఘం ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ దేవగుప్త శ్రీనివాస్, సెక్రెటరీ పి వీరబాబు,రాజు,సుబ్రహ్మణ్యం, రాజరాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కూరపాటి రాజన్న,మహేష్, రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరరావు,రాంబాబు, రమేష్,శివ విగ్నేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వరావు, సెక్రటరీ మీసాల గణేష్ కుమార్,తాపీ పనివారల సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరావు,రాజశేఖర్, మరియు అధిక సంఖ్యలో వివిధ సంఘాలలో ఉన్నటువంటి కార్మికులు పాల్గొన్నారు.

## పశ్చిమ గోనగూడెంలో ఎన్డీఏ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** ఎన్డీఏ ప్రభుత్వం రేషన్ షాపుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మంగళవారం పశ్చిమ గోనగూడెం గ్రామ సచివాలయంలో ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా ప్రజలకు రేషన్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రేషన్ బియ్యాన్ని వైసిపి నాయకులు, అధికారులు కుమ్మక్కై ఇతర దేశాలకు ఎగుమతి చేసేవరన్నారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు, దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే విధానానికి నాంది పలకాలన్న ఉద్దేశంతో క్యూఆర్ కోడ్ తో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. దీంతో డీలర్ల అక్రమాలకు చెక్ పెట్టొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కుచ్చు చెల్లారావు, బోజంకి శివ, రాచపోతుల సురేష్, చింతపల్లి శేఖర్, డీలర్లు రొంగల వరలక్ష్మి రామకృష్ణ, మామిళ్ళపల్లి భారతి, సెక్రెటరీ నదీషా, వీఆర్వో గరగ సూర్యకుమారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ తెరిసా జీవితం అంతా పేదల సేవకే అంకితం

– పొట్టిలంక లో మదర్ థెరిస్సా 116వ జయంతి నివాళి



**కడియం,విశ్వం వాయిస్ న్యూస్:** మదర్ థెరిస్సా 116వ జయంతి సందర్భంగా కడియం మండలం పొట్టిలంక గ్రామం,లూథరన్ ఆవరణంలో మదర్ థెరిస్సా సేవ సంఘం ఆధ్వర్యంలో మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించా రు. ముఖ్య అతిథిగా ఈ.నవీన్ మధర్ తెరిసా చిత్రపటానికి నివాళులర్పించి ఆయన మాట్లాడుతూ అందరితోనూ ప్రేమతో,నవ్వుతూ మాట్లాడేదనీ,"ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న"అని చెప్పిందని,ఆమె చేసిన సేవలను కొనియాడారు. న్యాయవాది బడుగు సత్తిబాబు కేక్ కట్ చేసి ఆయన మాట్లాడుతూ ఆమె తన జీవితం అంతా పేదల సేవకే అంకితం చేసిందని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షులు నక్కా వెంకట రత్నరాజు మాట్లాడుతూ ఆమె ఖండాలు దాటి భారతదేశం వచ్చి కులమతాలు లేకుండా అత్యుత్తమ సేవలందించిందని, ఆ సేవలకు నోబెల్ శాంతి మరియు భారతరత్న అవార్డులు అందుకున్నది గుర్తుచేశారు. చిన్నారులు, యువకులు మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి,ఆమె సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సంఘం, పొట్టిలంక అధ్యక్షుడు నక్కా వెంకట రత్నంరాజు, కార్యదర్శి అర్థాల కుమార్ బాబు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు నక్క చంటిబాబు,కొల్లపు వీరన్న, కొండేపూడి చిన్ని,నక్క ఆనందకుమార్, గుమ్మడి అర్జున్, బడుగు గణేష్, నక్క బాబీ,బడుగు వెంకీ, దాసి రాజు,యాళ్ల సురేష్, నెల్లి తేజ, నక్కరాజు, నెరిమెల్లి ప్రవీణ్ కుమార్, బడుగు రూపీలియ్య,నక్క అనుబాబు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శిగా జర్నలిస్ట్ వి. రవికుమార్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శిగా సీనియర్ జర్నలిస్ట్ వెలుగూరి రవికుమార్ నియమితుల య్యారు. సమితి సభ్యులు రవికుమార్ ను జిల్లా కర్నూలులో జరిగిన ఒక సమావేశంలో కార్యదర్శిగా ఎన్నుకుని ఆ నియామక పత్రాన్ని జిల్లా కార్యదర్శి రవికుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనకు ఈ భాద్యత అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్ప గించిన భాద్యతను సక్రమంగా నిర్వహిస్తూ జిల్లాలో ఉన్న హిందూ దేవా లయాల కమిటీ సభ్యులను కలుపుకుని హిందూ దేవాలయాల పరిరక్ష ణకు కృషిచేస్తానని రవికుమార్ తెలిపారు.

## ఘనంగా మదర్ థెరీసా జన్మదిన వేడుకలు



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** కుష్టివ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకొని విశేషమైన సేవలను అందించిన మదర్ తెరిసా జీవితం అందరికీ ఆదర్శమని లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు అన్నారు. మదర్ తెరిసా జయంతి సందర్భంగా మంగళవారం కొవ్వూరు పట్టణంలోని విజయ విహార్ సెంటర్ నందు ఉన్న మదర్ తెరిసా విగ్రహం వద్ద కొవ్వూరు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. మదర్ తెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు మాట్లాడుతూ 1910 సంవత్సరం ఆగస్టు 26వ తేదీన యుగోస్లేవియాలో జన్మించిన మదర్ తెరిసా చిన్ననాటి నుండే సమాజ సేవలను అందిస్తూ మానవసేవయే మాధవ సేవగా భావించి సమాజం నుండి వెలువేయబడ్డ కుష్టు రోగులను ఆదరించి అక్కున చేర్చుకుని వారికి నిరంతర సేవలను అందించి ప్రపంచానికే తల్లి అయిన ఘనత మదర్ తెరిసాకు కలిగిందన్నారు అటువంటి సేవా భావాలు కలిగిన మదర్ తెరిసా జీవితం మానవులందరికీ ఆదర్శప్రాయమని అన్నారు ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని మాజీ లైన్స్ క్లబ్ అధ్యక్షులు మద్దిపార్టీ సత్యనారాయణ ఉప్పులూరి రామకృష్ణ మహమ్మద్ హుస్సేన్ బూరుగుపల్లి వెంకటేశ్వరరావు తదితరు లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలమర్రి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా
# మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** పర్యావరణాన్ని రక్షించాలని సంకల్పంతో పిల్లలమర్రి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు మంగళవారం కొవ్వూరు పట్టణంలోని తొమ్మిదో వార్డు గౌతమి నగర్ నందు పిల్లలమర్రి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత అన్నారు భూమిపైన పుట్టిన ప్రతి మనిషి కి ఆ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు విషపూరితమైన ప్లాస్టో ప్యారిస్ ఒంటి పదార్థాలతో చేసిన వినాయక ప్రతిమలను వినియోగించుటవలన భూమిలో నీటిలో వాయువులో విష పదార్థాలు చేరి మానవ మనుగడకు ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం బాధ్యతగా తీసుకొని వినాయక చవితి వేడుకలలో మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని కోరారు పిల్లలమర్రి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ 17 సంవత్సరాలుగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం ఒక బాధ్యతగా తీసుకుందని చాౖరిబుల్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.



ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పిల్లలమర్రి సర్వేశ్వరరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ భారతీయ జనతా పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడిమల్ల విజయ వాణి మహా ఉపాధ్యాయ ద్వారపాల ప్రభాకర్ శర్మ గుంటముక్కల భైరవమూర్తి భారతి జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ, బోడపాటి ముత్యాలరావు కొవ్వూరు మండల బిజెపి అధ్యక్షులు దేగల సునీత త్వరగా విజయభాస్కరరావు గోపిశెట్టి శివకృష్ణ కొండపల్లి రత్న సాయి, బెల్లంకొండ మణికంత తదితరులు పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



**విశ్వం వాయిస్ కొవ్వూరు న్యూస్** వినాయక చవితి వేడుకల్లో మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరి పైన ఉందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, లయన్ సూరపనేని చిన్ని అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని మెరక వీధి రౌండ్ రామాలయం నందు కొవ్వూరు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహకారంతో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా సూరపనేని చిన్ని మాట్లాడుతూ విష వాయువులతో కూడిన పదార్థాలను వినియోగించిన వినాయక ప్రతిమలను వినియోగించడం వలన పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుందని మట్టి వినాయకుడి ప్రతిమను వినియోగించడం వలన విష కాలుష్యాన్ని నుండి చక్కటి పర్యావరణాన్ని భావితరాలకు అందించగలమన్నారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు పెనుమాక జయరాజు మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలలో ప్రజలు బావి తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే వినియోగిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మద్దిపాటి సత్యనారా యణ, కలగర వెంకటరావు, మద్దుల సత్యనారాయణ,బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, కంటమనే రామ కిషోర్, ఉప్పులూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## కొవ్వూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం

జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కు ఘన స్వాగతం పలకాలి – ఎమ్మెల్సీ సోము వీర్రాజు.



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** సారథ్యం అనే ఆలోచనతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా విచ్చేస్తున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఘన స్వాగతాన్ని పలకాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని గౌతమి నగర్ నందు 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ నివాసం వద్ద కొవ్వూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా తయారు చేయాలనే సంకల్పంలో రాష్ట్ర అధ్యక్షులు తూర్పుగోదావరి జిల్లా పర్యటన చేయడం జరుగుతుందన్నారు గ్రామ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజా శ్రేయస్సు కొరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోనికి తీసుకువెళ్లి భారతీయ జనతా పార్టీ ప్రజలకు మరింత చేరువు చేయాలన్నారు రాష్ట్ర అధ్యక్షుడు పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బోడపాటి ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, విజయభాస్కరరావు, కొవ్వూరు మండల బిజెపి అధ్యక్షులు దేగల సునీత, మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు తాడిమల్ల విజయ వాణి, గోపిశెట్టి శివకృష్ణ, కొండపల్లి రత్న సాయి, బెల్లంకొండ మణికంఠ తదితర భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మోరంపూడి శ్రీచైతన్య హాస్టల్‌లో ర్యాగింగ్ విద్యార్థిపై పైశాచికత్వం

హింసించిన వారిమీద చర్యలు తీసుకోవాలి

యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా జాప్యం..

చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం..





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** కోనసీమ జిల్లా మలికిపురం మండలం శంకరగుప్తం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి గుర్రం విన్సెంట్ ప్రసాద్ (16)పై సహచర విద్యార్థుల ర్యాగింగ్ పేరుతో పైశాచికత్వం పాల్పడితే వారిమీద యాజమాన్యం గానీ అక్కడ మానేజ్మెంట్ గానీ ప్రిన్సిపాల్ గాని చర్యలు తీసుకోక పోవడం దారుణం.. వేలాది రూపాయలు వసూలు చేసుకోవడమే ధ్యేయంగా రక్షణ అనేది లేకుండా తప్పు చేసిన వాళ్లను కాపాడుకుంటూ వ్యవహరిస్తున్నారు. అక్కడ ఉన్న విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకునే పరిస్థితి లేదు.సీసీ కెమెరాలు పోగొట్టారని అక్కడ పనిచేస్తున్న స్టాఫ్ కి గుర్రం విన్సెంట్ ప్రసాద్ ఫిర్యాదు చేస్తే అతని పైన ఐరన్ బాక్స్ తో పొట్ట భాగం, చేతులపై విచక్షణ రహితంగా వాతలు పెట్టి హింసిస్తే 10రోజులు గడుస్తున్నా కనీసం యాజమాన్యాలు విద్యార్థికి ఏమి జరిగిందని తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యకపోవడం సిగ్గుచేటు. విద్యా వ్యాపారాన్ని పెంచుకోవడం కోసం ర్యాంకుల కోసం విద్యార్థు లను హాస్టల్స్ లో బంధించి కారా?నాలుగా మార్చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఒక ప్రక్కన ఎలాంటి చర్యలు తీసుకోలేదు.పైగా విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకుండా జి ఓ లను పాస్ చేస్తుంది దోపిడీ అక్కడ జరుగుతున్న సమస్యలమీద మాట్లాడకుండా ప్రజాస్వామ్యానికి తూట్లు పెడిచేవిధంగా లోకేష్ బాబు ప్రవర్తిస్తున్నారు. భారత రాజ్యాంగం అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేసే ప్రయత్నం చేస్తున్నారు. 2025 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ -ప్రైవేట్ విద్యాసంస్థలకు ఒక ధీమా వచ్చేసింది ఎంత దోపిడీ అయినా చేసుకోవచ్చు అనే భావన లో ఉన్నారు.విద్యార్థి రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు ర్యాగింగ్ చేసినవాళ్లు చాలా ధీమాగా ఉన్నారు ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం ర్యాగింగ్,డ్రగ్స్, మదద్రవ్యాలమీద అవగాహసదస్సులు పెట్టాలని,జిల్లా కేంద్రంలో ఎలాంటి ఘటనలు జరుగుతుంటే డి ఈ ఓ వాసుదేవ రావు ఎందుకు స్పందించి చర్యలు తీసుకోలేదు చెప్పాలని, ఘటనకు పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని భవిషత్తులో ఇలాంటివి ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పీడీఎస్ యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# రాష్ట్రంపై జగన్ దుష్ప్రచారం మానుకోవాలి

– మంత్రివర్యులు కొలుసు.

–ప్రజలకు సేవచేసే నాయకులకే అందలం – ప్రత్తిపాటి.





**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** వైయస్సార్ సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి పెట్టుబడి పెట్టడానికి వస్తున్న పారిశ్రామికవేత్తలను భయపెడుతూ ఎన్డీఏ ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారని గృహ నిర్మాణశాఖ మాత్యులు కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బూరుగుపూడి గేటు వద్ద తెదేపా కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా త్రిసభ్య కమిటీసభ్యులు కొలుసు పార్థసారథి, ప్రత్తిపాటి పుల్లారావు, ఉగ్ర నరసింహారెడ్డి, పలువురు తెదేపా శాసనసభ్యులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన 15మాసాల్లో సుమారు పది లక్షలకోట్ల రూపాయలు రాష్ట్రంలో పెట్టుబడికి ఒప్పందాలు జరిగాయని, ఇది జీర్ణించుకోలేని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ పారిశ్రామికవేతను భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తెదేపా యువ నాయకుడు నారా లోకేష్ రాష్ట్రంలో ఐదేళ్లలో 5లక్షల మంది యువతకు ఉద్యోగకల్పనే ధ్యేయంగా వ్యూహాలు రచిస్తున్నారన్నారు. మాజీ మంత్రివర్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రానున్న సంస్థ గత ఎన్నికల్లో సీనియార్టీ, కుల ప్రాతిపదిక, ప్రజలకు సేవ చేస్తూ నిత్యం ప్రజలతో ఉండే నాయకులకు అధిష్టానం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల సమయంలో తటస్థంగా ఉండి, అధికారం వచ్చాక ఫేస్బుక్, వాట్సాప్ లో హడావిడి చేసే నాయకులను పక్కనపెట్టి, పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసేవ చేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిత్యం ప్రజల్లో ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళుతూ, పార్టీ ప్రకటించిన వ్యక్తికి వెన్నుదన్నుగా నిలుస్తూ అన్ని స్థానాల్లో విజయ నికేతన్ ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రావు, బూరుగు శేషారావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, చల్లా శంకర్రావు, ఆళ్ల గోవిందు, తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, అడపా వీరబాబు, దూది కాంతారావు, పుప్పాల వెంకటరత్నం, పీతా శ్రీనుబాబు, పెదపాటి భీమరాజు, కంటే గణపతి, దిడ్డి మాధవరావు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మదర్ థెరిసా మనందరికీ ఆదర్శం..



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** మానవత్వం,సేవాతత్వం లో మనందరికీ ఆదర్శం మదర్ థెరిసా అని పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి అన్నారు.ప్రేమ స్వరూపిణి మదర్ థెరీసా 115వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక రాజేంద్రనగర్ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం(ఆనంద నిలయం) నందు మదర్ థెరిసా చిత్రపటానికి పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు కోరుకొండ చిరంజీవి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి దారా ఏసురత్నం,జంగం సుబ్బారావు, బీజేపీ దళిత మోర్చ అధ్యక్షులు అర్థాల కుమార్ బాబు,వసతి గృహ అధికారి ఇసుకపట్ల రాజేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించి,కేక్ కట్ చేసి జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తులు మాట్లాడుతూ మానవత్వం, సేవాతత్వం తో మనందరికీ స్ఫూర్తి నిచ్చిన కరుణామూర్తి అని అన్నారు.తన జీవితాంతం వృద్ధుల,వికలాంగుల, నిర్భాగ్యుల సేవకే అంకితమైన మాతృమూర్తి అని కొనియాడారు.ఎక్కడో యుగోస్లేవియా లో పుట్టినా ఇక్కడ మన దేశ నిరుపేదలను చూసి చలించిపోయారని తన జీవితాంతం ఇక్కడే సేవలందించారని అన్నారు.అనంతరం విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.

## మదర్ తెరిసా పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని డాక్టర్ బాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో రక్తదానం



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రం మదర్ థెరిస్సా సెంటర్ నందు మదర్ తెరిస్సా పుట్టిన రోజును పురస్కరించుకొని మండల వైకాపా నాయకుడు, మదర్ థెరిస్సా ఫ్రెండ్స్ సర్కిల్ అధ్యక్షుడు పెదపాటి రమేష్ (డాక్టర్ బాబు) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాబు మాట్లాడుతూ నేటికి 129 సార్లు నా వరకూ నేను స్వచ్ఛందంగా బ్లడ్ ఇవ్వడం జరిగిందని ఇచ్చారు. మదర్ థెరిస్సా పుట్టినరోజు సందర్భంగా వికలాంగులకు వీల్ చైర్లు,,పలువురికి ఆర్థిక సహాయాన్ని,వృద్ధులకు పండ్లను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కాల శివరామకృష్ణ,మట్ట నరసింహమూర్తి,పెంటా సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య స్కూల్లో రాగింగ్‌కు విద్యార్థికి గాయం..

– విషయాన్నీ కప్పిబుచ్చిన శ్రీచైతన్య యాజమాన్యం


– పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

– ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై. భాస్కర్, ఎన్. రాజా డిమాండ్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి పై దాడి దారుణం తక్షణమే చర్యలు తీసులోవాలి ఎస్ఎఫ్ఐ డిమాండ్. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలు వై. భాస్కర్,ఎన్.రాజా ప్రకటన విడుదల చేశారు. భాస్కర్,రాజా విషయాలు తెలుపుతూ శ్రీచైతన్య స్కూల్ హాస్టల్ విద్యార్థులు సీసీ కెమెరా పగలకొట్టారని దాని విషయం తెలుసు కోవటానికి విచారణ చేయగా ఇద్దరు పగలకొట్టి మూడో విద్యార్థి బ్యాగ్ లో పెట్టారు.ఆ విద్యార్థి నాకు తెలియదు అని ప్రమాదం అని వాళ్ళకే తిరిగి ఇచ్చేసాడు,ఈ విషయం మీద హాస్టల్ ప్రిన్సిపాల్ విచారణ చేశాక ప్రసాద్ అనే మూడో విద్యార్థిని అడగ్గా ముందు నాకు తెలియదు అని చెప్పాడు తరువాత మళ్ళీ అడిగితే సీసీ కెమెరా పగలకొట్టిన విద్యార్థుల పేర్లు చెప్పాడు.దీంతో ఆ విద్యార్థులు ఐరన్ బాక్స్ పెట్టి చేతి మీద పొట్ట మీద కాల్చి కాళ్ళు మీద కొట్టి ఈ విషయం ఇంకెవరికి చెప్పిన చంపేస్తామని బెదిరించారు. ఇంత జరిగింది అని తెలిసినా హాస్టల్ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు తెలియకుండా కప్పి బుచ్చే ప్రయత్నం చేయటం చాలా దుర్మార్గమైన పని కనీసం విద్యార్థికి నాణ్యమైన వైద్యం చేయించలేదు వెలకి వేలు పెట్టి చదివిస్తుంటే విద్యార్థులను సరిగ్గా చూసుకోలేని శ్రీ చైతన్య యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆ విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## నాకు పంటనష్టం ఇప్పించి ప్రాణ రక్షణ కల్పించండి- వంక.





కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్: రాజానగరం మండలం దివాన్ చెరువులో వంక మల్లికార్జున స్వామికి చెందిన పది ఎకరాల పామాయిల్ తోటలో సంగిశెట్టి వీర వెంకట్రావు అతని అనుచరులు చెట్లు నరికి అపార నష్టం కలిగించారని తనకు న్యాయం చేసి నష్టపరిహారం ఇప్పించాలని రాజానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వంక మల్లికార్జున స్వామి పాత్రికేయులకు తెలిపారు. మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ దివాన్ చెరువులోని 10 ఎకరాల పామాయిల్ తోట అక్కరకు వస్తున్న సమయంలో సంగిశెట్టి వీర వెంకటరావు అతని అనుచరులు ఈనెల 24వ తేదీ రాత్రి పామాయిల్ మొక్కలు నరికి, విధ్వంసం చేశారన్నారు. గతంలో తమ పొలంలోని మోటార్ దొంగిలించడం, తన తోటలో పనిచేస్తున్న కూలీలను బెదిరించడం వంటివి చేసే, రాజానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. వారిని పోలీస్ స్టేషన్కు పిలిపించి మాట్లాడి తనకు నష్టపరిహారం ఇప్పించి, ప్రాణ రక్షణ కల్పించాలని వంక కోరారు.

## తనకాల నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేసిన సీతానగరం మండల టిడిపి నాయకులు



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** టిడిపి పార్టీ సీనియర్ నాయకులు తన కాల నాగేశ్వరరావు రాజానగరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా పలువురు సీతానగరం మండల టిడిపి నాయకులు ఆయన ఇంటిని సందర్శించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గద్దె వెంకటకృష్ణ చౌదరి ,(నల్లి) కాండ్రు శేఖర్, సీతానగరం పిఎసిఎస్ చైర్మన్ విత్తిన సతీష్,చంద్రాల ఫణి, సింగవరం ప్రెసిడెంట్ సంగాన చిన పోసి66య్య, సీతానగరం సోషల్ మీడియా కన్వీనర్, పుక్కాల శ్రీనివాస్, రమేష్ ,చైతన్య తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తుంది

ఎన్.ఎస్.యు.ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ,రాష్ట్ర ఇంచార్జి రాహుల్ గాంధీ

రాహుల్ గాంధీ నినాదం ప్రజల్లో మద్దతు లభిస్తుంది

జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ నేతలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం స్థానిక పేపర్ మిల్ మెయిన్ గేట్ ఎదురుగా గల శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపం లో తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన..జిల్లాస్థాయి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఎన్ ఎస్ యు ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ,రాష్ట్ర ఇంచార్జి రాజీవ్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ భారతదేశంలో రాహుల్ గాంధీ చేపట్టిన యాత్రకు మంచి స్పందన ఉందని, అలాగే ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో ఇప్పటి బీజెపి ప్రభుత్వం విఫలం చెందిందని,బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని గడిచిన ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని దీనిపై పోరాటానికి సిద్ధమైన రాహుల్ గాంధీకి మనమంతా మద్దతు పలకాలని, ఓట్ చోర్ గద్దె చోడ్ నినాదాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అన్ని నియోజకవర్గాలు ఇన్చార్జిలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఐఎన్టీయూసీ ప్రతినిధి జేటి రామారావు, జిల్లా ఇంచార్జి కొలనుకొండ శివాజీ, డాక్టర్ వడియార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ వివిధ నియోజకవర్గాల ఇన్చార్జ్ లు, బెజవాడ రంగారావు,పట్నాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం!! పర్యావరణాన్ని కాపాడుదాం!!



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఎస్.పి.ఆర్.బ్లూ (ఇ.యం)స్కూల్లో వినాయక చవిత వేడుకలు ఒక్కరోజు ముందుగానే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో ప్రత్యేకంగా మట్టి వినాయకుని ప్రతిష్టించి స్కూల్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ ఎస్.ఎస్.శ్రీ రామ సతీష్ మాట్లాడుతూ పర్యావనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి మన సంస్కృతిని, మన సంప్రదాయాలను, గౌరవించి రాబోయే తరానికి మంచి పర్యావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని తెలియజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జలాశయాలు కలుషితమవుతున్నాయన్నారు. మరోవైపు నాగు,అడపా శివ మాట్లాడుతూ మట్టి విగ్రహానికి పూజించడం వల్ల మనకు మన ప్రకృతికి ఎంతో సహాయపడతాయని వివరించారు. అమలాపురం లోని వట్టిగూడెంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ నాగు,అడపా శివ, హెచ్.ఎమ్ ఎస్.వి.ఎస్. సత్యనారాయణ, పి.శివ,కె.వరప్రసాద్, పి.శివకృష్ణ,డి.రాజు,స్కూల్ పిఈటి విజయలక్ష్మి, ఎ.మహాలక్ష్మి,జి.సింధూ,ఎస్.కె.ముత్తాజ్,పి.రాధ,ఎమ్. మాధురి,ఎస్.గౌర్లి,ఇందు, విజయదుర్గ స్కూల్ సిబ్బందితో పాటు పేరెంట్స్, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ చలువపందిరిలను పరిశీలించిన డీఎస్పీ రఘువీర్



**మండపేట మండలం... విశ్వంవాయిస్ న్యూస్...** వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆకాంక్షించారు. రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండపాల కమిటీ సభ్యులకు పలు సూచనలు చేసేందుకు ఆయన ఇప్పనపాడులోని గణేశ్ మండపాలను పరిశీలించారు. మండపాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. తొమ్మిది రోజుల పాటు అప్రమత్తంగా ఉండి, ఉత్సవాలను ప్రశాంతంగా ముగించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యుత్ లైటింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, లౌడ్‌స్పీకర్లు చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించకుండా వాడాలని సూచించారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు లేదా అసభ్య కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తి శ్రద్ధలతో గణపతి ఆరాధన చేస్తే గణపయ్య కృపాకటాక్షాలు లభిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట రూరల్ సీఐ పీ దొరరాజు, ఎస్సై కిషోర్ ఉన్నారు.

## ఇది సిసి రోడ్డా..? లేక ఎర్ర గ్రావెల్ రోడ్డా..?

అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్ల ప్రజలు అసహనం...



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మండపేట పట్టణంలో సత్యశ్రీ థియేటర్ రోడ్డు మీదుగా రాజరత్న థియేటర్ నుండి దిబ్బగరువు ఎస్సీ పేట వరకు సిమెంట్ రోడ్డు కనుమరుగాయేనని స్థానికులు అందోళన వ్యక్తపరుస్తున్నారు. రాత్రింబవళ్ళు అతివేగంతో పోటాపోటీగా ఎర్ర గ్రావెల్ తరలింపు వల్ల ఎండలో దుమ్ము లేస్తే ఈ వర్షాలకు అది జారుడు బురదగా మారి వాహన చోధకులు పాదాచారులు ప్రమాదాలకి గురవుతున్నారు. వ్యాపార సముదాయాలకు కూడా ఇది పెద్ద సమస్యగా మారిందని అక్కడ వ్యాపారస్తులు గగ్గోలు పేడుతున్నారు. దళిత వాడల పట్ల ఇంత నిర్లక్ష్యమా అని దళితవాడ నాయకులు, ప్రజలు మరియు 8వ వార్డు వైసిపి కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆవేదన వ్యక్తపరిచారు. అయినా సరే ఎటువంటి చలనం లేకుండా వ్యవహారిస్తున్న రోడ్డు మరియు భవనాల శాఖా, పట్టింపు లేని మున్సిపాలిటీ అధికారులు, పాలకులు తీరుపట్ల 5 వార్డుల ప్రజలు అసహనం వ్యక్తపరిచారు.

## మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబుకి గీతకార్మికుల సంఘం ఘన సన్మానం



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక రావులమ్మ నగర్ లోనితెలుగుదేశం పార్టీ కార్యాలయంలోజగ్గంపేట శెట్టి బలిజి గీత కార్మికుల సంఘం అధ్యక్షులు వాన శెట్టి సూరిబాబు, ఉపాధ్యక్షులు కుప్ప తాతారావు ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీనుమణి బాబును ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ మా శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో మండల టిడిపి అధ్యక్షుడిగా బాధ్యత స్వీకరించిన జీను మణిబాబుని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశామని జగ్గంపేట సాంబా చెరువు వెళ్లే రోడ్డు అద్వానంగా ఉందని ఏటి కాలువకు కలవర్టు కట్టి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కి తెలియజేసి పనులు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా టిడిపి ప్రభుత్వం హామీ ఇచ్చిన 50 సంవత్సరాలకే పింఛన్ పథకాన్ని కూడా తొందరలోనే ఏర్పాటు చేయాలని కోరారు. గీత కార్మికులకు ఆదరణ పథకంలో వాహనాలు పనిముట్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలిక అప్పారావు, పిల్లి శ్రీను, కుప్పా సింహాచలం, లావేటి శ్రీను, గొర్రెల రవణ, రాయుడు నాగేశ్వరరావు అధిక సంఖ్యలో గీత కార్మికులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన ముద్రగడ గిరిబాబు



**జగ్గంపేట : విశ్వం వాయిస్ న్యూస్** ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ నా తండ్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుని, మా కుటుంబంపై శ్రద్ధ చూపుతున్నందుకు జగన్ మోహన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానుఅని అన్నారు. ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగన్ మోహన్ రెడ్డి, ఆయన త్వరగా కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయిలో కష్టపడి పనిచేయాలని గిరిబాబుకు సూచించారు.

## జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సౌజన్యంతో 100 ట్రై సైకిళ్ల పంపిణీకి సిద్ధం

**జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అర్హులైన దివ్యాంగులకు లబ్ధి**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ మరియు జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పర్యవేక్షణ లో జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండ లాల్లో అర్హులైన దివ్యాంగులకు 100 ట్రై సైకిళ్లు పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. అర్హులైన దివ్యాంగులు తమ వివరాలతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కార్యాలయాన్ని సంప్రదించగలరు.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:
95812 95555, 99896 46555

ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) అధ్యక్షులు మండపాక అప్పన్న దొరని సంప్రదించండి
81065 50651

# మండల పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీలకు పోలీస్ వారి సూచనలు



**కరప:విశ్వం వాయిస్ న్యూస్** కరప పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ విగ్రహాలును ఏర్పాటు చేయు ఉత్సవ కమిటీలకు కరప పోలీస్ వారి సూచనలు హెచ్చరికలు జరిసేశారు ఇందులో 1.గణేష్ విగ్రహాలు పెట్టుకొనే వారు, ఎవ్వరూ ఎటువంటి చలానాలు కట్టనవసరం లేదు ఆన్లైన్లో మాత్రమే పర్మిషన్ తీసుకోవాలి

2. సింగిల్ విండో విధానం ద్వారా ఆన్లైన్లో అనుమతి పొందవచ్చు(ఆఫీసుల చుట్టూ తిరిగవలసిన అవసరం లేదు)

3.నాలుగు అడుగులు దాటిన విగ్రహాల దగ్గర సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలి

4.మండపాలు రోడ్డు యూజర్స్ కు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలి

5.24%ఇ%7 గణేష్ మండపం వద్ద రాత్రి సమయాల్లో ముగ్గురు వాలంటీర్లు కాపలాగా ఉండవలెను.

6.అగ్ని ప్రమాదములు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి, మండపాలు వద్ద ఇసుక, డ్రమ్ములలో నీరు, ఫైర్ ఎక్సటింగ్ విషర్స్ ఉంచాలి

7.ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

8.జూద క్రీడలకు, అశ్లీల నృత్య ప్రదర్శనలకు, మత్తు పానీయాలకు, మత్తు పదార్థాలకు దూరముగా ఉండాలి మరియు ఎటువంటి ఇతర అసాంఘిక కార్యక్రమాలు ఉండరాదు.

9.ఊరేగింపులు, శాంతియుతం గా ప్రశాంత వాతావరణంలో నిర్ణీత రూటలో,సమయం లలో, నిర్ణీత నిమజ్జన ప్రాంతంలో పూర్తి చేయాలి.

10.శబ్ద కాలుష్యానికి పాల్పడ కూడదు ( నిర్ణీత డెసిబుల్ మించ రాదు)(రాత్రి 10 నుండి ఉదయం 6గంటల మధ్య లౌడ్ స్పీకర్స్ నిశిద్ధం)

11.నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి నీటి ప్రమాదము లు లేకుండా నిమజ్జన ప్రాంతంలో నిర్వాహకులు దగ్గర ఉండి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకొని నిర్వహించాలి

12.మండపంలకు చుట్టూ పశు పక్ష్యాదులకు కరెంటు షాక్ ఇబ్బంది లేకుండా రక్షణ ఏర్పాటు చేయాలి

13.ప్రశాంత వాతావరణం లో శాంతి భద్రతలకు హాని జరుగ కుండా , క్రమ శిక్షణతో, సహనం, సామరస్యం తో ఎవరి మనోభావాలను నొప్పించకుండా పూర్తి భక్తి విశ్వాసలతో ఆధ్యాత్మిక భావంతో నిర్వాహకులు గణేష్ ఉత్సవములు నిర్వహించాలని కరప సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టి.సునీత, తెలియజేసారు

## విద్యార్థులకు యూనిఫారంలు ఇచ్చిన డాక్టర్ సత్య స్వరూప్.

**- కరప మాజీ సర్పంచ్ తాతీలు కోరిక మేరకు.**



**కాకినాడ రూరల్( కరప): విశ్వం వాయిస్ :** కరప మండలం కరప గ్రామం శ్రీ నక్క సూర్యనారాయణమూర్తి జడ్పీపీ హై స్కూల్ ఆవరణలో ఇంటర్ ప్లస్ టు ఉమెన్స్ కాలేజ్ లో 30 మంది విద్యార్థినిలకు యూనిఫామ్స్ కావాలని ప్రధాన అధ్యాపకురాలు శ్రీమతి రాజరాజేశ్వరి, టీచర్ శ్రీమతి నక్కా బుజ్జి ఇరువురు సోషల్ యాక్టివేటర్ పోలిశెట్టి నారయ్య అలియాస్ తాతీలు ని కోరగా, తాతీలు ఈ విషయాన్ని మేడిశెట్టి అప్పలస్వామి కుమారుడు డాక్టర్ సత్య స్వరూప్ కి తెలియపరిచారు. వెంటనే స్పందించిన డాక్టర్ సత్య స్వరూప్ సుమారు 48000 రూపాయలతో రెండు జతలు యూనిఫామ్స్ చొప్పున 30 మంది విద్యార్థులకు అందజేశారు. అధ్యాపకులు, మరియు పోలిశెట్టి తాతీలు డాక్టర్ సత్య స్వరూప్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు పెద్దలు డాక్టర్ మేడిశెట్టి సత్య స్వరూప్ పై ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్ట్ సాక్షి అబ్బు, నక్కా శ్రీనుబాబు, నక్కా సత్తిబాబు, పేపకాయల మాచర్రావు, పేకేటి ప్రసాద్, నక్కా ఏసు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపూడి కోడి పందాలపై పోలీసులు తనిఖీలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి నెల్లిపూడి గ్రామ శివారులో కొన్ని రోజులుగా జోరుగా నిర్వహిస్తున్న కోడి పందాలపై సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల వెనుక కొందరు పెద్ద మనుషుల అండదండలతో జరుగుతున్న ఈ జూదం గురించి చెప్పాలని తలంచి స్థానిక పోలీసుల మీద నమ్మకం లేక నేరుగా జిల్లా కేంద్రం కాకినాడకు వెళ్లి సోమవారం నాటి ప్రజా వేదికలో జిల్లా కలెక్టరు షన్ మోహన్ కు కొందరు నెల్లిపూడి అభ్యుదయ వాదులు ఫిర్యాదు చేశారు. దీంతో జూదం నిర్వహణపై తనిఖీ చేయాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. వెంటనే పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేసారు. కొందరు పారిపోగా ముగ్గురు జుదరులను అదుపులోనికి తీసుకున్నారు. 15 మోటార్ సైకిళ్ళను, రూ. 2,650 నగదును, మూడు పందెం కోడి పుంజులను, రెండు కత్తులను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి సమయం పైగా బాగా ఆలస్యం కావడంతో నిందితుల ఫొటోలు, వీడియోలను తీయలేక పోయామని పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వివరణ ఇచ్చారు. అయితే ఆ ముగ్గురు జూదరులు ఎవరెవరు..?, ద్విచక్ర వాహనాలు, అలాగే పందెం కోడి పుంజులు, పందెం కోడి కత్తులు ఎవరెవరివో కూడా పోలీసులు వారి సామాజిక మాధ్యమ ప్రకటనలో వెల్లడించ లేదు.

## అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర




**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ క్యాంపస్ లో స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అడిషనల్ ఎస్పీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఆవరణంలో పెరిగిన మొక్కలను శుభ్రం చేశారు. ముళ్ళ పొదలను తీసివేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక పోలీస్ సిబ్బంది, ఏఎన్ఎస్ పార్టీ, సి ఆర్ పి ఎఫ్ సిబ్బందితోపాటు సీఐ గోపాల కృష్ణ, ఎస్ఐ పి రమేష్, ఏఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఎస్సై







**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** దేశ, రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించటం, ఎక్కువ రేట్లకు అమ్మటం, నిరోధక చర్యలలో భాగంగా చింతూరులో మంగళవారం ఎస్సై రమేష్, హార్టి కల్చర్ ఆఫీసర్ ముత్తయ్య, ఎర్రం పేట లోని మన గ్రోమోర్ ఫెర్టిలైజర్, షాపును మరో ప్రైవేట్ షాప్ ను తనిఖీ నిర్వహించారు. ఆయా షాపుల్లో డి ఎ పి, యూరియా నిల్వలు లేవని నిర్ధారించారు. ఈ మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ద్వారపూడిలో మదర్ థెరిసా జయంతి వేడుకలు



**మండపేట మండలం... విశ్వంవాయిస్ న్యూస్...** ద్వారపూడి గ్రామం లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ తెరిసా 116 వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండపేట మండలం ద్వారపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న మదర్ తెరిసా విగ్రహానికి మదర్ థెరిస్సా సేవాసమితి సభ్యులు, ప్రభుత్వా ఆసుపత్రి వైద్యులు పి జగదీప్ జాన్ వెస్లీ, గేదెల కిషోర్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సిబ్బందికి చాక్లెట్లు బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మదర్ థెరిస్సా చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంకటాల మురళీకృష్ణ, సుంకర నాని చింతా శ్రీనివాసరావు, పల్లా సన్యాసిరావు, ముత్యం మణికంఠ, అలిజింగి రాంబాబు, అంపోలు అప్పారావు, కోట్ల లక్ష్మణ్, తొంటా శ్రీనివాసరావు, బట్టా అర్జున్. రహీం, కొవ్వలి కోటేశ్వరరావు, చిన్న బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్య ను కలెక్టర్లకు విన్నవించిన వర్మ



**అమలాపురం , జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 26:** మత్స్యకారుల సమస్యలపై మత్స్యకార ప్రతినిధులు మత్స్య శాఖల అధికారుల తో కూలంకశంగా పూర్తిగా చర్చించి మరో 10 రోజుల్లో అందరికీ ఆమోదయో గ్యంగా సముద్ర తీర ప్రాంతంలో చేపల వేట పరిమితులను నిర్ణయిం చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారుల సముద్రపు వేట సమస్య లను విన్నవించేందుకు పిఠాపురం మాజీ శాసనస భ్యులు వర్మ నేతృత్వంలోని మత్స్యకార సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ వారిని కలిసి సమస్యలను వివరించారు.ఉప్పాడ కొత్తపల్లి మత్స్యకారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎక్కడయినా స్వేచ్ఛగా వేట చేసుకునే అవకాశం కలిపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వారికి మాజీ శాసనస భ్యులు వర్మ వినతి పత్రాన్ని సమర్పించారు. యు. కొత్తపల్లి మండలంలో మత్స్య కారులు సము ద్రంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా. ఎక్కడయినా స్వేచ్ఛగా చేపల వేట చేసు కొనే హక్కు ఉందని వర్మ తెలిపారు. గతంలో 2014 -19 చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగాఉన్నపుడు నర్సాపురం దగ్గర అంతర్వే ది,బీమవరం వద్ద గొల్లపా లెం వైజాగ్ ఈ ప్రాంతాలలో వేటకు అభ్యంతరాలు కలిగి నప్పుడు అక్కడ జిల్లా కలెక్టర్, ఎస్.పి.లకు చెప్పి ఈ ప్రాంతాలలో వేట చేసుకునే అవకాశం కల్పించారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు వేట చేసు కునే అవకశం ఈ ప్రాంతాల లో లేదనీ. దయచేసి మీరు అధికారులకు తెలియజేసి ఈ ప్రాంతాలలో మత్స్యకా రులు వేట కొనసాగించే విధంగా అవకాశం కల్పిం చాలని వర్మ జిల్లా కలెక్టర్ వారిని సవినయంగా కోరారు. ఈ అంశాలపై చర్చలు నిర్వహించిన పిదప జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ సముద్రంపై చేపల వేట పరిమితిని నిర్దేశిం చేందుకు మరొకసారి మత్స్యకార ప్రతినిధులు మత్స్య శాఖ అధికారులతో చర్చించి మరో పది రోజుల లో అందరికీ ఆమోదయో గ్యంగా సముద్ర%శీ% పై చేపల వేట పరిమితులను నిర్ధారిం చడం జరుగుతుందని ఆయన మాజీ శాసనస భ్యులు వర్మకు మరియు మత్స్యకార ప్రతినిధులకు సూచించారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రావులపాలెంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసిన నాయకులు



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** మట్టి గణనాధుని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడాకుందామంటూ బీజేపీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని ప్రతిమలు అందజేత. వినాయక చవితి పూజను పురస్కరించుకుని మంగళ వారం నాడురావులపాలెం లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దింశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఆ పార్టీ నాయకులు చేతులు మీదుగా పలువురికి గణపతి ప్రతిమలను అందజేశారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు కూడా పాటుపడాలన్నారు సనాతన హిందూ ధర్మంలో ఎంతో భక్తితో నిర్వహించుకునే గణేష్ పూజ నవరాత్రులను అత్యంత ఘనంగా జరుపుకుంటు మట్టి వినాయకుని పూజిద్దామన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం.బీజేపీ కొత్తపేట అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్.అసెంబ్లీ కో. కన్వీనర్ గంగ్రోతు వీరగోవిందరావు. యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి. పాలూరి జయప్రకాశ్ నారాయణ. బీజేపీ రావులపాలెం మండల అధ్యక్షులు కొవ్వూరి కృష్ణారెడ్డి.కొత్తపేట మండల అధ్యక్షులు సంపతి కనకేశ్వరరావు. కంకటాల వెంకటరత్నం (నాని ). పసుపులేటి మహాలక్ష్మణరావు.బొర్రా ఆంజనేయులు.విర్నాల రమణ బాబు. మంచిగంటి రామకృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో మట్టి వినాయక ప్రతిమలు అందించిన కలెక్టర్



**అమలాపురం , జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 26:** ణపతి నవరాత్రులు ఉత్సవాలను పురస్కరిం చుకొని ఈనెల 27వ తేదీ వినాయక చవితి సంద ర్భంగా మట్టి వినాయక ప్రతిమలను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కలెక్టరేట్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషా%శీ%తి డిఆర్ఓ కే మాధవి, ఏవో కే కాశీ విశ్వేశ్వరరావు, తదిత రులకు పంపిణీ చేశారు పర్యావరణ హితంగా గణపతి నవరాత్రి ఉత్స వాలను నిర్వహించు కునేందుకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను విని యోగించి. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

## మేడిది చిన్న కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్** అంబాజీపేటలో ప్రముఖ వ్యాపారి, తెలుగుదేశం పార్టీ నాయకులు, అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మేడిద రంగా జానకి ప్రసాద్ (చిన్న) (55) అమలాపురం రూరల్‌లోని రోడ్డు ప్రమాదంలో పాలగుమ్మి ప్రధాన పంట కాలువలో దురదృష్టవశాత్తూ మృతి చెందారు. ఈ అకాల మరణం పట్ల ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ వార్త తెలిసిన వెంటనే పి.గన్నవరం శాసనసభ్యులు గడ్డి సత్యనారాయణ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మేడిది జానకి ప్రసాద్ ( చిన్న ) ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు.

# అవకాడో తింటే ఈ సమస్యలన్నీ దూరం..



సూపర్‌ఫుడ్ అవకాడో పోషకాలతో నిండి ఉంటుంది. దీన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవకాడో.. ఈ పండు రెగ్యులర్ ఫ్రూట్స్ కంటే బోలెడన్నీ హెల్త్ బెనిఫిట్స్‌ని కలిగి ఉంటాయి. ఈ అవకాడోలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. అవకాడో మధ్య అమెరికాలో పుట్టింది.. దీనిని తరచుగా శాండ్‌విచ్‌లు, సలాడ్‌లు, స్మూతీల రూపంలో తీసుకుంటారు. బరువును నియంత్రించడంలో అవకాడో అద్భుతంగా పనిచేస్తుంది. ఇది ఎముక ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి మంచిది. ఇందులో విటమిన్ ఇ, ఫైబర్ ఉంటుంది. ఇది కడుపు నిండిన అనుభూతి కలిగిస్తుంది. అవకాడో తక్షణ శక్తి కూడా అందిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేకాదు రక్తపోటును కూడా ఇది నివారిస్తుంది.అవకాడో ఒక ఫైబర్ ఆహారం. ఇది మన జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు దూరంగా ఉంటాయి. ఈ పండులో విటమిన్ కె, విటమిన్ బి6, విటమిన్ సి, విటమిన్ ఇ తగినంత పరిమాణంలో కనిపిస్తాయి. ఇది ఎముకలను బలపరుస్తుంది. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా ఉండటం వల్ల, ఇది మన కణాలను ఫ్రీ రాడికల్స్ హానికరమైన ప్రభావాల నుండి రక్షిస్తుంది. అవకాడోలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అదే సమయంలో, విటమిన్ సి ఉండటం రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది. మెగ్నీషియం మంచి మూలం కాబట్టి, అవకాడో తీసుకోవడం నరాలు, కండరాలకు కూడా మంచిది. గర్భిణీ స్త్రీలు అవకాడో తీసుకోవడం ద్వారా తగినంత మొత్తంలో ఫోలేట్ పొందుతారు. ఇది శిశువు వెన్నుపాము, మెదడు అభివృద్ధికి అవసరం. ఇది మిమ్మల్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచుతుంది. విటమిన్లు, ఖనిజాల మంచి వనరుగా ఉండటం వల్ల, ఇది శరీరానికి అనేక ముఖ్యమైన ప్రయోజనాలను అందిస్తుంది. అవకాడో మన రక్తంలో చక్కెరను సమతుల్యం చేస్తుంది. దీనికి చాలా తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. డయాబెటిక్ రోగులు తమ ఆహారంలో అవకాడోను తప్పనిసరిగా చేర్చుకోవాలి. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలలో ఆకస్మిక మార్పులను నివారిస్తాయి. అవకాడోలో విటమిన్ బి6 ఉండటం వల్ల, ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల మన జ్ఞాపకశక్తి మెరుగుపడు తుంది. మన మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మెదడులో న్యూరోట్రాన్స్మిటర్లను ఉత్పత్తి చేయడం ద్వారా మెదడు కణాలను కూడా పోషిస్తుంది. అవకాడోలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా అవసరం. అవకాడోలో అసంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యం చేస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు, రక్తపోటు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అవకాడోలో అధిక ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. ఫైబర్ తీసుకోవడం వల్ల ప్రేగులకు మేలు జరుగుతుంది. ఇది మన ప్రేగులను శుభ్రపరుస్తుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. అవకాడో ఒక ఫైబర్ ఫుడ్. ఇందులో తక్కువ మొత్తంలో కేలరీలు ఉంటాయి. ఫైబర్ ఉండటం వల్ల, దీనిని తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలిగా అనిపించదు. ఇది కొవ్వును కరిగించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి అవకాడో అనువైన పండు. దీనితో పాటు, విటమిన్ జు ఇందులో ఉంటుంది. ఇది మన జుట్టును బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అవకాడో నూనె జుట్టుకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఇది మన చర్మానికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది యాంటీ ఏజింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది.

# బలంగా పెరగాలంటే ఇవి తప్పనిసరి..



జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు. 1. గుడ్డు – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. 2. పాలకూర – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది. 3. బెర్రీలు – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీ–రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి. 4. చేపలు – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా–3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు. 5. వాల్‌నట్స్ – వాల్‌నట్స్ ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. 6. క్యారెట్లు – క్యారెట్లలో బీటా–కెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది. 7. విత్తనాలు –గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి. 8. బీన్స్ – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు. 9. చిలగడదుంప – చిలగడదుంపలో బీటా–కెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

# ఆరోగ్యానికి సూపర్ ఫుడ్స్..



నల్ల అత్తిపండ్లు: అంజీర్ తీపిగా ఉంటుంది. కానీ అందులో చక్కెర పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ప్రోటీన్, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండే నల్ల అత్తి పండ్లను తినాలని వైద్యులు కూడా సూచిస్తారు. మీరు ప్రతిరోజూ రెండు నల్ల అత్తి పండ్లను రాత్రి నానబెట్టి, ఉదయం పరగడుపున తింటే చాలా మంచిది. నల్ల వెల్లుల్లి: బ్లాక్ వెల్లుల్లి రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దీంతోపాటు ఈ వెల్లుల్లి గుండెకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది యాంటీ బాక్టీరియల్, క్రిమినాశక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది అనేక ఇతర వ్యాధుల నుండి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మినుములు: ప్రోటీన్ లోపాన్ని అధిగమించడానికి మినుములు తీసుకోవడం మంచిది. వీటిలో కార్బోహైడ్రేట్లు, విటమిన్ దీ6, పొటాషియం, కాల్షియం ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మినుములు తినడం వల్ల గుండెతో పాటు నాడీ వ్యవస్థకు కూడా మేలు కలుగుతుంది. నల్ల ఎండుద్రాక్ష: ఎండుద్రాక్షల్లో ప్రోటీన్, పిండి పదార్థాలు, ఫైబర్, చక్కెర, కాల్షియం, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ మరియు విటమిన్ సి వంటి అనేక పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్షలు గుండె, బిపి, ఎముకలు, ఉదరం, జుట్టు, చర్మానికి, రక్తహీనతకు కూడా ఇది మేలు చేస్తుంది. బ్లాక్ రైస్: చాలా మంది వైట్ రైస్ తింటారు. కానీ మీరు ఎప్పుడైనా బ్లాక్ రైస్ గురించి విన్నారా.. వీటిలో పీచు, ప్రొటీన్‌తో పాటు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. బ్లాక్ రైస్ ఒత్తిడిని తగ్గిస్తుంది. బ్లాక్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం చాలా మంచిది.

# ఈ సమస్యలు ఉన్నవారు జామకాయ అసలు తినొద్దు?



జామకాయ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, పొటాషియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన రోగనిరోధక శక్తిని పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడతాయి. అయితే ఈ పండు ఎంత ఆరోగ్యకరమైనదైనా, కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పేగు సమస్యలు ఉన్నవారు: జామకాయలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మంచిదే అయినప్పటికీ, పేగు సమస్యలు లేదా గ్యాస్, విరేచనాలు వంటి కడుపు సమస్యలతో బాధపడేవారికి ఇది మరింత ఇబ్బంది కలిగించవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం.. అధిక ఫైబర్ కంటెంట్ ఈ సమస్యలను పెంచే అవకాశం ఉంది. కాబట్టి పేగు సమస్యలు ఉన్నవారు జామకాయ తినకూడదు. కిడ్నీ సమస్యలు ఉన్నవారు: కిడ్నీ ఫౌండేషన్ ప్రకారం.. జామకాయలో అధికంగా ఉండే పొటాషియం మూత్రపిండాల సమస్యలను తీవ్రతరం చేయవచ్చు. అందువల్ల, మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారు జామకాయను ఎక్కువగా తినకుండా ఉండటం మంచిది. ఎలా తినాలి?: ఆరోగ్య నిపుణుల సలహా ప్రకారం.. రోజుకు ఒక పండిన జామకాయను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. జామకాయను ఓట్స్ లేదా పెరుగుతో కలిపి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మరింత మెరుగుపడుతుంది. ఒకవేళ మీరు జామకాయకు బదులుగా మరొక పండు తినాలని అనుకుంటే, బొప్పాయిని ఎంచుకోవచ్చు. ఇందులో కూడా ఫైబర్, విటమిన్ సి వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. జామకాయ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. గర్భిణీ స్త్రీలకు ఫోలిక్ యాసిడ్ శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధికి సహాయపడుతుంది. కానీ లాభాలతో పాటు కొన్ని నష్టాలు కూడా ఉంటాయి. మీకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, దీనిని తినే ముందు వైద్య నిపుణులను సంప్రదించడం చాలా ముఖ్యం.

# ఖాళీ కడుపుతో మెంతి నీళ్లు తాగుతున్నారా?



మంచి ఆరోగ్యానికి మెంతులు చేసే అంతా ఇంతా కాదు.. మెంతుల్లోని ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాల్షియం, సోడియం, పొటాషియం, విటమిన్–డి, విటమిన్– సి వంటి పోషకాలు మనకు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. మెంతుల్లోని కొన్ని సమ్మేళనాలు ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయి. రక్తంలో చక్కెర నియంత్రణ సహజంగానే సాధ్యమవుతుంది. అంతేకాకుండా, దీనిలోని కరిగే ఫైబర్ చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. ఇది భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధించవచ్చు. అయితే అయితే వరుసగా రెండు వారాల పాటు మెంతులు తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. బరువు నియంత్రణ: మెంతి నీరు జీర్ణవ్యవస్థకు చాలా మంచిది. ఇందులో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ త్వరగా కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. అందువలన ఇది ఆకలిని తగ్గిస్తుంది. ఇది బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఈ నీరు మలబద్ధకం, కడుపు నొప్పి, ఆమ్లత్వం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యం: మెంతి నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గుతాయి. ఇది రక్తపోటును నియంత్రించడంలో, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో, ధమనులలో ఫలకం ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. మెరిసే చర్మం: మెంతి నీరు చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు చర్మపు రంగును మెరుగుపరుస్తాయి. మొటిమలు, మచ్చలను తగ్గిస్తాయి. ఇది సహజమైన మెరుపును ఇస్తుంది. అంతేకాకుండా, ఇది చుండ్రును తగ్గిస్తుంది. తలలోని చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: మెంతి నీరు రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే ఫైటోఈస్ట్రోజెన్లు హార్మోన్ల హెచ్చుతగ్గులను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఫ్లేవనాయిడ్లు, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల, మెంతి నీరు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరాన్ని

# బిజినెస్ వాయిస్

## దూకుడు పెంచిన యాపిల్ కంపెనీ



ఇండియాలో యాపిల్ ఫోన్ల తయారీని నిలిపివేయాలని ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఆ కంపెనీకి ఒత్తిడి వస్తున్నా.. యాపిల్ కంపెనీ మాత్రం భారత్‌లో తన కార్యకలాపాలను మరింత దూకుడుగా విస్తరిస్తోంది. తాజాగా మన దేశంలో నాలుగో స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ కంపెనీ తెలిపింది. భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్న యాపిల్ నాలుగో యాపిల్ స్టోర్‌ను ఏర్పాటుచేయను న్నట్లు మంగళవారం ప్రకటించింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన కొరెగావ్ పార్క్‌లో సెప్టెంబర్ 4న దీనిని ప్రారంభించనుంది. అలాగే స్టోర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్‌ను కూడా విడుదల చేసింది. బెంగళూరులోని స్టోర్ మాదిరిగానే పుణెలోని స్టోర్‌ను కూడా నెమలి కళాకృతితో తీర్చిదిద్దారు. ఈ స్టోర్ 10వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంటుందని సమాచారం. కొత్త ఐఫోన్ 17 లాంచ్ కానున్న నేపథ్యంలో ఈ ప్రారంభంపై ప్రకటన వచ్చింది. ఇప్పటికే ముంబయి, దిల్లీ, బెంగళూరులో స్టోర్లు ఉన్నాయి. భారత్‌లో వ్యాపార వృద్ధికి ఇంకా భారీ అవకాశాలు న్నాయని గతంలో వ్యాఖ్యానించిన యాపిల్ సీఈఓ టిమ్‌కుక్.. అందుకు అనుగుణంగా దేశంలో నాలుగు రిటైల్ స్టోర్లు నెలకొల్పు తామని చెప్పిన సంగతి తెలిసిందే. త్వరలో విడుదల కాబోయే ఐఫోన్ 17 మోడళ్లన్నింటినీ దేశంలోనే తయారుచేయాలని యాపిల్ కంపెనీ నిర్ణయించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించి, అమెరికాకు ఎగుమతులపై టారిఫ్ రిస్క్‌లను తప్పించుకోవడానికి యాపిల్ ఈ వ్యూహాత్మక ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యాపిల్ రాబోయే అన్ని ఐఫోన్ 17 మోడళ్లను భారత్‌లోని ఐదు ప్లాంట్లలో చేపట్టనుంది.

## ట్రంప్ అదనపు సుంకాల ఎఫెక్ట్.. భారీ నష్టాల్లో సూచీలు



దేశీయ మార్కెట్లు భారీ నష్టాలతో ప్రారంభమ య్యాయి. అమెరికా విధించిన అదనపు సుంకాల విషయంలో ఎలాంటి మినహాయింపు లేకపోవడం మన సూచీలపై ప్రభావం చూపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు నష్టాలకు కారణమవుతు న్నాయి. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 600 పాయింట్లు నష్టపోయి 81,036 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 181 పాయింట్లు క్షీణించి 24,788 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 87.83గా ఉంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ఆటో, హెచ్‌యూఎల్, హీరో మోటార్‌కార్ప్ షేర్లు లాభాల్లో ఉండగా.. టాటా స్టీల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, సిప్లా స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలు మరికొన్ని గంటల్లో అమల్లోకి రానున్నాయి. దీనిపై అమెరికా తాజాగా న్యూదిల్లీకి అధికారికంగా నోటీసులు పంపించింది. అగ్రరాజ్య కాలమానం ప్రకారం ఆగస్టు 27వ తేదీ ప్రారంభమయ్యే అర్ధరాత్రి 12.01 గంటల నుంచి (అంటే భారత కాలమానం ప్రకారం ఆగస్టు 27 ఉదయం 10 గంటల ప్రాంతంలో) ఈ అదనపు సుంకాలు అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. ఆ సమయం తర్వాత నుంచి అమెరికాలోకి ప్రవేశించే భారత ఉత్పత్తులకు ఈ టారిఫ్‌లు వర్తిస్తాయని వెల్లడించింది. నిన్న అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్ల పైనా ఆ ప్రభావం కనిపిస్తోంది. ఫెడ్ గవర్నర్ లిసాకుక్‌ను ట్రంప్ తొలగించడమే ఇందుకు కారణం.

# పాతికేళ్ల హ్యుందాయ్ గర్వాన్ని అణిచేసిన మహీంద్రా




పొట్టోడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోచమ్మ కొడుతుంది.. ఈ సామెత హ్యుందాయ్ అనే కొరియా కార్ల కంపెనీకి వాస్తవంలో తెలిసి వచ్చింది. గడచిన 25 సంవత్సరాలుగా హ్యుందాయ్ కంపెనీ కార్ల తయారీలో మనదేశంలో తిరుగులేని స్థానంలో ఉంది. వెర్నా నుంచి మొదలు పెడితే క్రెటా వరకు హ్యుందాయ్ అద్భుతమైన మోడల్స్ తీసుకొచ్చి భారతీయ మార్కెట్ లో కీలక శక్తిగా ఆవిర్భవించింది. 25 సంవత్సరాలుగా తన అప్రతిహత ప్రయాణాన్ని కొనసాగించిన హ్యుందాయ్ కి దేశీయ ఆటోమొబైల్ దిగ్గజ సంస్థ మహీంద్రా దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది.. ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్ నివేదించిన సమాచారం ప్రకారం జనవరి నుంచి జూలై అమ్మకాలలో కొరియన్ కంపెనీ కంటే మహీంద్రా 21, 283 ఎక్కువ వాహనాలను విక్రయించింది. ఈ ఏడాది 351,065 వాహనాలను మహీంద్రా విక్రయించింది.. హ్యుందాయ్ ఇదే సమయంలో 329,782 యూనిట్లు విక్రయించింది. బలమైన మార్కెట్.. విస్తృతమైన వినియోగదారుల నమ్మకం.. భవిష్యత్తు అవసరాల ను ముందుగానే పసిగట్టి వాహనాలలో ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా మహీంద్రా గణనీయమైన వృద్ధిని సాధించింది. గత ఏడాది ఇదే కాలంలో మహీంద్రా రెండు లక్షల పైగా వాహనాలను విక్రయించింది. అదే సమయంలో హ్యుందాయ్ 358,785 వాహనాలను విక్రయించింది. కానీ ఈ ఏడాది మహీంద్రా 291, 971 వాహనాల నుంచి 351,065 వాహనాలను విక్రయించి తన వృద్ధిని 20.2 శాతానికి పెంచుకుంది. హ్యుందాయ్ అమ్మకాలు 358,785 నుంచి 329,782 కు పడిపోయాయి. వృద్ధి కూడా 8.1 శాతానికి తగ్గింది. హ్యుందాయ్ మందగమనానికి ప్రధాన కారణం అది క్రెటా అనే మోడల్ మీద అతిగా ఆధారపడటమే. మహీంద్రా విజయానికి ఎక్స్ యూ వీ 3 ఎక్స్ ఓ, థార్, రాక్స్, స్కార్పియో, స్కార్పియో ఎన్, బీఈ 6, ఎక్స్ ఈ వీ 9వ వంటి మోడల్స్ కారణం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమేటివ్ మ్యానుఫ్యాక్చరర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం క్రెటా అమ్మకాలు 20% పెరిగాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో 162, 773 నుంచి 2025 ఆర్థిక సంవత్సరానికి 194,871 వాహనాలు అమ్ముడుపోయాయి. ఐ టెన్ నియోస్, ఐ20, ఆరా, ఎక్స్ టర్, వెన్యూ, వెర్నా, అల్కాజర్, టక్సన్, ఐయోనిక్ 5 వంటి కార్ల అమ్మకాలు 10 శాతం తగ్గాయి. 451,948 యూనిట్ల నుంచి 403,795 కు పడిపోయాయి. మరోవైపు మహీంద్రా తన ఐస్, ఈవీ మోడల్స్ తో ఆటోమొబైల్ మార్కెట్లో దూసుకుపోతోంది. వచ్చే రోజుల్లో మరో కొత్త మోడల్స్ ను పరిచయం చేయనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో హ్యుందాయ్ ని విక్రయాల పరంగా మహీంద్రా అధిగమించింది. ఈ ఏడాది ఇప్పటివరకు మారుతి సుజుకి మొదటి స్థానంలో ఉంది. దాని అమ్మకాలు 1.9 శాతానికి పడిపోయినప్పటికీ 1,036,368 నుంచి 1,016,481 యూనిట్లకు తగ్గింది. హ్యుందాయ్ తర్వాత టాటా మోటార్స్ నాలుగు స్థానాల్లో ఉంది.. 1998 %-% 99 లో హ్యుందాయ్ శాంత్రో అనే మోడల్ తో ఇండియాలోకి ప్రవేశించింది 2000 సంవత్సరం నాటికి టాటా మోటార్స్ ను అధిగమించింది. మారుతి సుజుకి తర్వాత మన దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థగా ఎదిగింది. 2024 వరకు హ్యుందాయ్ తన ప్రయాణాన్ని సాగించింది.

# ట్రంప్ టారిఫ్ దాడిపై ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




భారత ఎగుమతులపై అమెరికా ప్రకటించిన 50 శాతం సుంకాలు రేపటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. ముంబైలో జరిగిన ఖీ×జజ×–×దీూ వార్షిక బ్యాంకింగ్ సమావేశంలో ూఖఅయిఖఎ మీుత్రీప్రశీతీు మాట్లాడుతూ.. ట్రంప్ సుంకాలతో భారత ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉన్నప్పటికీ, అవసరమైతే కేంద్ర బ్యాంకు ముందుకు వచ్చి వృద్ధికి, ప్రభావిత రంగాలకు మద్దతు ఇచ్చే చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ముఖ్యంగా ప్రభావిత రంగాలకు మద్దతు ఇవ్వడానికి =దీ× ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అవసరమైతే మేము వెనుకడుగు వేయమని తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థలో తగినంత ద్రవ్యత అందుబాటులో ఉందని.. అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పెట్టుబడులను ఇతోధికం చేసేందుకు బ్యాంక్‌లు, కార్పొరేట్లు కలసి రావాలని ఆర్బీఐ గవర్నర్ పిలుపునిచ్చారు. త్వరలోనే బాసెల్-3 నిబంధనలను అమల్లోకి తెస్తామని గవర్నర్ తెలిపారు. అందరికీ ఆర్థిక సేవలను మరింత విస్తృతం చేయడం, చిన్న వ్యాపారులకూ రుణ సాయాన్ని మరింతగా దగ్గర చేయడం, కస్టమర్ సేవల నాణ్యతను ఇంకా పెంచడం తమ ప్రాధాన్యతలని సంజయ్ మల్హోత్రా అన్నారు. 45 శాతం ఎగుమతులు టారిఫ్ పరిధికి బయట ఉన్నాయి. మిగిలిన 55 శాతంవస్తువులు మాత్రమే అమెరికా సుంకాల ప్రభావాన్ని ఎదుర్కొంటాయని తెలిపారు. ఇందులో రత్నాలు-ఆభరణాలు, వస్త్రాలు, దుస్తులు, తోలు ఉత్పత్తులు, మీవీజు లు ఎక్కువగా ఒత్తిడిని ఎదుర్కొంటాయని మల్హోత్రా హెచ్చరించారు. ముఖ్యంగా కార్మిక ఆధారిత పరిశ్రమలు అయిన వస్త్రాలు, పాదరక్షల రంగం దెబ్బతినే అవకాశం ఉందని భారత ప్రభుత్వం కూడా అంచనా వేసింది. ఇప్పటికే ఈ రంగాల ప్రతినిధులు, ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్‌లతో చర్చలు జరిపినట్లు సంజయ్ తెలిపారు.

## మరోసారి విధ్వంసం సృష్టించిన సంజూ శాంసన్..

# ఆసియా కప్‌కు ముందు మహోగ్రరూపం




ఆసియా కప్ 2025 ప్రారంభానికి ముందు టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అరివీర భయంకరమైన ఫామ్‌లో ఉన్నాడు. తన సొంత రాష్ట్రం కేరళలో జరుగుతున్న టీ20 లీగ్‌లో వరుస విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగిపోతున్నాడు. ఈ టోర్నీలో తానాడిన తొలి మ్యాచ్‌లోనే మెరుపు శతకంతో (అరైస్ కొల్లాం సైలర్స్‌పై 51 బంతుల్లో 121బీ 14 ఫోర్లు, 7 సిక్సర్లు) బీభత్సం సృష్టించిన సంజూ.. తాజాగా రెండో మ్యాచ్‌లోనూ అదే తరహా విధ్వంసం కొనసా గించాడు. ఈ టోర్నీలో కొచ్చి బ్లూ టైగర్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న సంజూ.. ఇవాళ (ఆగస్ట్ 26) త్రిస్సూర్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో 46 బంతుల్లో 4 ఫోర్లు, 9 సిక్సర్ల సాయంతో 89 పరుగులు చేసి ఔటయ్యాడు. సంజూ ఔట్ కాగానే టైగర్స్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలుతోంది. త్రిస్సూర్ బౌలర్ కే అజినాస్ సంజూను ఔట్ చేసిన తర్వాత వరుసగా మరో రెండు వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. సంజూ క్రీజ్‌లో ఉన్నంత సేపు 200 దిశగా సాగిన టైగర్స్ స్కోర్ ఒక్కసారిగా నెమ్మదించింది. 18 ఓవర్ల తర్వాత ఆ జట్టు స్కోర్ 167/7గా ఉంది. టైగర్స్ ఇన్నింగ్స్‌లో సంజూతో పాటు అతడి అన్న సాలీ శాంసన్ (6 బంతుల్లో 16బీ 2 ఫోర్లు, సిక్స్) ?కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఇదిలా ఉంటే, ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో సంజూ శాంసన్‌కు చోటు దక్కిన విషయం తెలిసిందే. అయితే తుది జట్టులో అతని స్థానంపై మాత్రం అనుమానాలు నెలకొన్నాయి. రెగ్యులర్ ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్ రీఎంట్రీ ఇవ్వడమే ఇందుకు కారణం. గిల్.. అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడని టీమిండియా మేనేజ్‌మెంట్ సంకేతాలిచ్చింది. ఒకవేళ సంజూను తుది జట్టులో తీసుకున్నా మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు పంపే అవకాశం ఉంది. అయితే మిడిలార్డర్‌లో అతడికి అంత మంచి ట్రాక్ రికార్డు లేదు. కేరళ లీగ్‌లో ఓపెనర్‌గా సంజూ భీకర ఫామ్‌ను చూసిన తర్వాత టీమిండియా మేనేజ్‌మెంట్ మనసు మార్చుకుంటుందేమో చూడాలి.

# న్యూజిలాండ్ క్రికెట్‌కు బిగ్ షాక్




న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా జట్టుకు దూరం కాగా.. తాజాగా మరో ఆటగాడు కూడా ఈ జాబితాలో చేరాడు. ఫాస్ట్ బౌలర్ విలియమ్ ఓరూర్కే ఆటకు మూడు నెలల పాటు దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ న్యూజిలాండ్ క్రికెట్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. కాగా ఈనెలలో జింబాబ్వే పర్యటనలో భాగంగా తొలి టెస్టు సందర్భంగా 24 ఏళ్ల విలియమ్ గాయపడ్డాడు. అతడి వెన్ను నొప్పి దిగువ భాగంలో తీవ్రమైన నొప్పి రావడంతో.. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత పరీక్షలు చేయించుకున్నాడు.

### కనీసం మూడు నెలలపాటు విశ్రాంతి

ఈ క్రమంలో గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేలింది. కనీసం మూడు నెలలపాటు విలియమ్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. కాగా అక్టోబరులో ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత ఇంగ్లండ్, వెస్టిండీస్‌లతో కూడా తలపడాల్సి ఉంది.

### గ్లెన్, ఫిన్ కూడా అవుట్

ఈ మూడు ప్రధాన సిరీస్‌లకు విలియమ్ ఓరూర్కే దూరం కానున్నాడు. మరోవైపు.. ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ జగజ్జల్లో గాయం కారణంగా ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తప్పుకొన్నాడు. ఇక ఓపెనింగ్ బ్యాటర్ ఫిన్ అలెన్ కూడా కుడికాలి పాదం నొప్పితో కనీసం మూడు నెలలపాటు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి.

### సారథికీ గాయం

ఇదిలా ఉంటే.. కివీస్ వన్డే, టీ20 క్రికెట్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ కూడా గాయపడటం గమనార్హం. గజ్జల్లో నొప్పి కారణంగా అతడు ఇటీవలే ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చాడు. ది హండ్రెడ్ లీగ్ నుంచి అర్ధంతరంగా తప్పుకొన్నాడు. సాంట్నర్ కూడా నెలరోజుల పాటు ఆటకు దూరంగా ఉండనున్నాడు. అయితే, ఆసీస్‌తో టీ20 సిరీస్ నాటికి అతడు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

### అతడొక వరల్డ్ క్లాస్‌ప్లేయర్.. జట్టులో ఉంటాడు

ఈ విషయాల గురించి న్యూజిలాండ్ హెడ్‌కోచ్ రాబ్ వాల్టర్ మాట్లాడుతూ.. "విలియమ్ పరిస్థితి బాధాకరంగా ఉంది. అతడు త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం. గ్లెన్, ఫిన్ కూడా ఇప్పటికే దూరమయ్యారు. ఇటీవలి కాలంలో వీరిద్దరు టీ20 జట్టులో కీలక బ్యాటర్లుగా మారిపోయారు. కానీ దురదృష్టవశాత్తూ గాయాలు వారిని వెంటాడుతున్నాయి. మిచెల్ సాంట్నర్ ఓ వరల్డ్‌క్లాస్ ప్లేయర్. ఆటగాడిగా, కెప్టెన్‌గా అతడి నైపుణ్యాలు అమోఘం. జట్టులో అతడు ఉంటాడు. అయితే, సర్జరీ తర్వాత ఫిట్‌నెస్ ఆధారంగా మ్యాచ్ ఆడతాడా? లేదా? అన్నది తేలుతుంది" అని తెలిపాడు. మరోవైపు.. పేస్ బౌలర్ బెన్ సీర్స్ రూపంలో కివీస్‌కు శుభవార్త అందింది. పక్కటెముకల నొప్పి నుంచి అతడు కోలుకున్నాడు. కాగా గాయం వల్ల ఈ పేస్ బౌలర్ జింబాబ్వే పర్యటనకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే.

# క్రీడా వాయిస్

## రోహిత్ శర్మను తప్పించడానికే బ్రాంకో టెస్ట్: టీమ్ ఇండియా మాజీ క్రికెటర్

ఇంటర్నెట్ డెస్క్: టీమ్‌ఇండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను తేల్చేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న యోయో పరీక్షతో పాటు బ్రాంకో టెస్టునూ ఇకపై బీసీసీఐ ప్రవేశ పెట్టనుంది. ఈ నిర్ణయంపై పలువురు మాజీల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. అయితే టీమ్‌ఇండియా ఆటగాళ్లలో




ఫిట్‌నెస్ ప్రమాణాలను పెంచడం కోసం స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అడ్రియన్ లి రాక్స్ ఈ పరీక్షను జట్టుకు పరిచయం చేశాడు. అంటే ఇకపై ఓ ఆటగాడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ధ్రువీకరించాలంటే అతడు యోయోతో పాటు బ్రాంకో టెస్టులోనూ పాసవ్వాల్సి ఉంటుంది. అయితే.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పించడానికే ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టారని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్రమైన ఆరోపణలు చేశాడు. విరాట్ కోహ్లి రోహిత్ శర్మ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్లోనే కొనసాగుతున్నారు. వీరు 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడదామనుకుంటున్నారు. అయితే రోహిత్ శర్మకు బ్రాంకో టెస్ట్ పాస్ కావడం కాస్త కష్టంతో కూడుకున్న పని అని మనోజ్ తివారీ ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డాడు. 'నా ఉద్దేశం ప్రకారం 2027 వరల్డ్ కప్ ప్రణాళిక నుంచి విరాట్ కోహ్లీని పక్కకు పెట్టడం అంత సులువు కాదు. కానీ వారు రోహిత్ శర్మను తప్పించాలనుకుంటున్నారు. ఇండియన్ క్రికెట్‌లో ఏం జరుగుతుందో నేను సునిశితంగా పరిశీలిస్తున్నా. రోహిత్ శర్మను భవిష్యత్తులో వన్డే జట్టు నుంచి దూరం చేయడం కోసమే ఇటీవల బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెట్టారు' అని మనోజ్ తివారీ ఆరోపించాడు.

### యోయోకు తోడుగా బ్రాంకో!

'మీకు తెలుసా.. బ్రాంకో టెస్ట్ అత్యంత కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షల్లో ఒకటి. అయితే ఈ టెస్ట్‌ను ఇప్పుడే ఎందుకు ప్రవేశపెట్టారనేదే ప్రశ్న. కొత్త హెడ్‌కోచ్ ఈ పరీక్షను మొదటి సిరీస్ నుంచే ఎందుకు అమలు చేయలేదు? అసలు ఇది ఎవరి ఆలోచన? దీన్ని ఎవరు ప్రవేశపెట్టారు? కొన్ని రోజుల క్రితం ఈ బ్రాంకో టెస్ట్‌ను ఎవరు అమలు చేశారు? ఇవి నా దగ్గర సమాధానాలు లేని ప్రశ్నలు. కానీ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టకపోతే.. ఈ టెస్ట్ పాసవడం అతడికి అంత తేలిక కాదు. ఈ బ్రాంకో టెస్ట్‌తో.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పిస్తారని నేను భావిస్తున్నా' అని మనోజ్ తివారీ వాపోయాడు. బ్రాంకో అంటే పరుగు పరీక్ష. ఎక్కువగా రగ్బీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను నిర్ణయించేందుకు ఉపయోగిస్తారు. దీని ద్వారా ప్లేయర్ల శారీరక సామర్థ్యం, వేగం, మానసిక దృఢత్వంపై ఓ అంచనాకు రావొచ్చు. ఈ పరీక్షలో ఒక ఆటగాడు విరామం లేకుండా ఆరు నిమిషాల వ్యవధిలో మొత్తంగా 1200 మీటర్ల దూరం పరుగెత్తాల్సి ఉంటుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్




## ఓజీతో లెక్కలు సరిచేయనున్న పవన్



ఒకప్పుడు వసూళ్ల పరంగా రికార్డులు నెలకొల్పుతూ.. ఇండస్ట్రీ హిట్లు కొడుతూ టాలీవుడ్ టాప్ స్టార్లలో ఒకడిగా ఉండేవాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. ఖుషి, గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది లాంటి చిత్రాలు సాధించిన వసూళ్లు చూసి ఆయా సందర్భాల్లో అందరూ ఆశ్చర్యపోయారు. బాహుబలి కంటే ముందు ఇండస్ట్రీ రికార్డ్ పవన్ పేరిటే ఉంది. ఐతే రాజకీయాల్లో బిజీ అయ్యాక పవన్‌కు సినిమాల మీద ఫోకస్ తగ్గిపోయింది. సరైన కాంబినేషన్లు కుదరలేదు. ఎక్కువగా రీమేక్‌లు చేశాడు. దీంతో ఆయన సినిమాల బిజినెస్, వసూళ్ల స్థాయి పడిపోయింది. అదే సమయంలో వేరే స్టార్లు ముందుకు దూసుకెళ్లిపోయారు. వంద కోట్ల షేర్ అన్నది చాలామందికి కేక్ వాక్ అయిపోయింది. కానీ పవన్ మాత్రం ఇంకా ఆ ఘనతను అందుకోలేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. గత దశాబ్ద కాలంలో ఆయన చేసిన స్ట్రెయిట్ మూవీస్ అజ్ఞాతవాసి, హరిహర వీరమల్లు డిజాస్టర్లు కాగా.. రీమేక్ మూవీస్ ఒక స్థాయికి మించి ఆడలేకపోయాయి. దీంతో వంద కోట్ల షేర్ అన్నది పవన్‌కు ఇప్పటికీ కలగానే ఉంది. కానీ ఈ కలెక్షన్ల రికార్డులు ఎప్పుడూ ఆయన దృష్టిలో ఉండలేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీని నడపడానికి మాత్రమే సినిమాలు చేస్తున్నానని ఆయన చెప్పిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఐతే పవన్ కొత్త సినిమా 'ఓజీ'కి ఉన్న అనూహ్యమైన హైప్ దృష్ట్యా వంద కోట్ల షేర్ అన్నది లాంఛనమే అనడంలో సందేహం లేదు. టాక్ ఎలా ఉన్నా ఈ సినిమా వంద కోట్ల షేర్ సాధించడానికి అడ్డంకులేమీ లేనట్లే. ఐతే పవన్ ఆ ఘనతను సాధిస్తే సరిపోదు. దానికి రెట్టింపు వసూళ్లు రాబడితేనే 'ఓజీ'ని సక్సెస్ ఫుల్ సినిమాగా నిలబెట్టగలడు. ఎందుకంటే ఈ సినిమాకు బిజినెస్ ఆ రేంజిలో జరిగింది. ఓజీ నైజాం హక్కులు మాత్రమే రూ.60 కోట్లు పలకడం విశేషం. ఆంధ్రా రైట్స్ రూ.75 కోట్లు, రాయలసీమయ హక్కులు రూ.25 కోట్ల దాకా పలికినట్లు సమాచారం. ఓవర్సీస్ రైట్స్ అన్నీ కలిపితే మొత్తం బిజినెస్ లెక్క రూ.200 కోట్లకు చేరుతోంది. అంటే ఆ మేరకు 'ఓజీ' షేర్ రాబట్టాల్సి ఉంది.


# రవితేజ ఫ్యాన్స్‌కి బ్యాడ్ న్యూస్.. 'మాస్ జాతర' వాయిదా!

రవితేజ తాజా చిత్రం 'మాస్ జాతర' విడుదల వాయిదా పడుతున్నట్లు గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లే నిజమయ్యాయి. ఈ సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ చిత్రం ఆగస్ట్ 27న విడుదల కావాల్సింది. కానీ ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు మరియు కీలకమైన కంటెంట్ పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతలు అధికారికంగా తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే.. కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు. మాస్ జతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. అభిమానులు నిరీక్షణకు బహుమానంగా త్వరలో ఆశ్చర్యకర కంటెంట్ రాబోతుందని నిర్మాతలు హామీ ఇచ్చారు మాస్ జాతర విషయానికొస్తే.. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల మళ్లీ జంటగా కలిసి నటిస్తున్న సినిమా ఇది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.



## శ్రీలీల హిందీ డెబ్యూ ఎవరితో

తెలుగులో టాప్ మోస్ట్ డిమాండ్ ఎంజాయ్ చేస్తున్న శ్రీలీల త్వరలో పరాశక్తితో తమిళంలో అడుగు పెట్టనుంది. కన్నడలో జూనియర్ ద్వారా ఆ లాంఛనం అయిపోవడంతో నెక్స్ట్ టార్గెట్ హిందీ కానుంది. తను అక్కడ రెండు సినిమాలు చేసింది. వాటిలో మొదటిది ఇబ్రహీం అలీ ఖాన్ సరసన చేసిన డైలర్. అయితే షూటింగ్ ఏ దశలో ఉందనేది ఇప్పటిదాకా ఎలాంటి అప్డేట్ లేదు. స్త్రీ లాంటి బ్లాక్ బస్టర్స్ నిర్మించిన మాడాక్ ఫిలిమ్స్ దీనికి నిర్మాత. ట్విస్ట్ ఏంటంటే డైలర్ ని నేరుగా ఓటిటి రిలీజ్ చేయాలనే ఆలోచనలో నిర్మాణ సంస్థ ఉందని ముంబై టాక్. అధికారిక ప్రకటన రాలేదు కానీ టాక్స్ బలంగా ఉన్నాయి. డైలర్ కన్నా ఎక్కువగా శ్రీలీల ఆశలు కార్తీక్ ఆర్యన్ తో చేస్తున్న సినిమా మీదున్నాయి. ఆషీకీ 3గా ప్రచారంలో ఉన్న ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో మంచి పాటలు, సైయారా స్థాయిలో రొమాన్స్, యూత్ ని ఆకట్టుకునే అంశాలు చాలా ఉన్నాయని వినికిడి. ఇది థియేటర్ రిలీజ్ అవుతుంది. దీంతో తనకు పెద్ద బ్రేక్ దక్కుతుందనే నమ్మకం శ్రీలీలలో ఉంది. కార్తీక్ ఆర్యన్ తో తన స్నేహం గురించి ముంబై మీడియాలో ఏవేవో ప్రచారాలు జరిగినా వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్తోంది.




## హనుమాన్ హీరో కొత్త మూవీ.. రిలీజ్ డేట్ ఇదే

బాలనటుడిగా కెరీర్ మొదలుపెట్టి.. హీరోగా 'హనుమాన్'తో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న తేజా సజ్జా.. ఇప్పుడు 'మిరాయ్'తో రాబోతున్నాడు. ఇది సూపర్ హీరో తరహా సినిమానే. చాన్నాళ్లుగా వాయిదాలు పడుతూ వచ్చింది. ఫైనల్‌గా సెప్టెంబరు తొలివారం రిలీజ్ పెట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడిందని చెబుతూ కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. తేజా సజ్జా హీరోగా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్‌గా చేస్తున్నాడు. రితికా నాయక్ హీరోయిన్. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్స్ మీడియా సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. ఈ చిత్రాన్ని తొలుత సెప్టెంబరు 5న రిలీజ్ చేయాలనుకున్నారు. మరి ఏమైందో ఏమో గానీ వారం ఆలస్యంగా అంటే సెప్టెంబరు 12న థియేటర్లలో తీసుకురానున్నట్లు ఇప్పుడు కొత్త పోస్టర్ వదిలారు. అలానే ఈనెల 28న ట్రైలర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ముందే పీపుల్స్ మీడియా సంస్థలో తేజా సజ్జా మరో చిత్రానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. రీసెంట్‌గానే ఆ ప్రకటన కూడా వచ్చింది. అయితే అది 'జాంబీరెడ్డి' సీక్వెల్ అని సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది.

# కమర్షియల్ సినిమాల్లో వెయ్యి తప్పులున్నా పట్టించుకోరు




అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పరదా'. ఈ సినిమాకు ప్రవీణ్ కాండ్రేగులా దర్శకత్వం వహించగా ఆగష్టు 22న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే ఈ సినిమాపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విమర్శలపై తాజాగా స్పందించింది అనుపమ. 'పరదా' సినిమా విజయోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ.. కమర్షియల్ సినిమాల్లో ఎన్ని తప్పులు ఉన్నా విమర్శకులతో పాటు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరని, కానీ ప్రయోగాత్మక, నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలను తెరకెక్కిస్తే అందులో వెయ్యి తప్పులు వెతుకుతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పరంగానే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా ఇలాంటి ధోరణులు కనిపిస్తుంటాయని తెలిపారు. కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే దానిని సగం మంది విమర్శిస్తుంటారని, అయితే తాము పడిన కష్టాన్ని గుర్తించి, ఇలాంటి కొత్త కథలను ప్రోత్సహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల కూడా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు మంచి కథలను ఆదరిస్తారనే నమ్మకంతోనే ఈ సినిమా తీశామని, కానీ కొందరు మంచి కంటెంట్‌ను విస్మరించి తప్పులు వెతకడంపైనే దృష్టి సారిస్తున్నారని అన్నారు. ముఖం కనిపించని పాత్రలో నటించేందుకు ఒప్పుకున్న అనుపమ ధైర్యం గొప్పదని, ఈ సినిమాతో ఆమెకు జాతీయ అవార్డు రావాలని ఆకాంక్షించారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com